అక్రమ కలప రవాణాకు అడ్డు కట్ట



అనుమతులు లేని కలప లారీ, ఫారెస్ట్ అధికారుల స్వాధీనం

నవతెలంగాణ-రామాయంపేట

గత కొంతకాలంగా రామాయంపేట కేంద్రంగా సాగుతున్న అక్రమ కలప రవాణాకు రామాయంపేట అటవీ శాఖ అధికారులు అడ్డుకట్ట వేశారు. గత నాలుగైదు నెలలుగా రామాయంపేట శివారు ప్రాంతమైన దామరచెరువు దగ్గర నీలగిరితో పాటు, ఇతర కలపను ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున డంపు చేసి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతంలో రెండు మూడుసార్లు అటవీశాఖ అధికారులు, దాడులు చేసి జరిమానాలు విధించినా, అవేమీ లెక్క చేయకుండా అక్రమ కలప రవాణా దర్జాగా కొనసాగిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం డిప్యూటీ అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో, దామరచెరువు ప్రాంతంలో డంపు చేసిన కలపను స్వాధీనపరచుకున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించడానికి లోడ్ చేసిన లారీని ఆధీనంలోకి తీసుకున్నారు. విచారణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని అటవి శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

నవతెలంగాణ మెదక్

సమగ్ర తెలుగు దినపత్రిక

1

గురువారం | 30 జనవరి 2025 | www.navatelangana.com

కేటీఆర్‌ను కలిసిన మున్సిపల్ కౌన్సిల్ మాజీ సభ్యులు



నవతెలంగాణ-సదాశివపేట

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ల ఆశీస్సులతో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నాయకత్వంలో సదాశివపేట పట్టణ అభివృద్ధికి పాటు పడి.. ఇటీవలే పదవి కాలం ముగించుకున్న సదాశివపేట మున్సి పల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మెన్, కౌన్సిల్ సభ్యులు బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని హరీశ్‌రావు, కేటీఆర్‌లు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ పాటిల్, మాజీ వైస్ చైర్మన్ చింతాగోపాల్, మాజీ కౌన్సిలర్‌లు ఇంద్రమోహన్ గౌడ్, విద్యాసాగర్ రెడ్డి, సాతాని శ్రీశైలం, పిల్లిగుండ్ల వీరేశం, మోబిన్, నాయకులు ఆత్మకూర్ నాగేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శారీరకంగా దృఢంగా ఉంటేనే చురుకుగా పనిచేస్తారు.



నవతెలంగాణ-మెదక్

ఉద్యోగులు శారీరకంగా దృఢంగా ఉంటేనే చురుకుగా పనిచేస్తారని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు అన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వివిధ శాఖల ఉద్యోగులను కొనియాడారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యా వ్యవసాయం, పంచాయతీ విభాగాల ఉద్యోగులను శాలువాలతో కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలలో భాగంగా ఈనెల 24, 25 తేదీలలో హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో మన జిల్లా తరపున 20 మంది క్రీడాకారులు వివిధ క్రీడా పోటీలలో పాల్గొన్నారని, అందులో నలుగురు వివిధ శాఖల్లో పని చేస్తూ పోటీల్లో పాల్గొని క్రీడాకారులు జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం ఉద్యోగులకు క్రీడలు నిర్వహిస్తున్నందున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ప్రభుత్వమే అన్ని ఖర్చులు భరించి క్రీడాకారులను పంపడం జరుగుతుందన్నారు. వీరందరూ కూడా ఫిబ్రవరి నెల మొదటి వారంలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఉద్యోగుల ఎంపిక పట్ల ఆయా శాఖ అధికారులను అభినందించారు. అనంతరం జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులు సతీష్, రాజశేఖర్ గౌడ్, శ్వేతా కుమారి, శారదలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.నగేష్, జిల్లా

సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీలో...
ఉమ్మడి మెదక్ జిల్లాకు ప్రాతినిధ్యం

- రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆముదాల మల్లారెడ్డి, గొల్లపల్లి జయరాజు
- కంట్రోల్ కమిషన్ సభ్యులుగా కడారి నర్సమ్మ ఎన్నిక
- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా చుక్క రాములు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు దిగ్విజయవంతంగా ముగిశాయి. మంగళవారం ముగింపులో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆయా జిల్లాలు, రంగాల వారిగా ప్రాధాన్యతలను బట్టి రాష్ట్ర కమిటీ సభ్యుల్ని ఎన్నుకున్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర నూతన కమిటీలో ఉమ్మడి మెదక్ జిల్లాకు సముచిత స్థానం లభించింది. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా చుక్క రాములు తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ఉమ్మడి మెదక్ జిల్లాలో సీపీఐ(ఎం) ఉద్యమ విస్తరణలో కీలక నాయకులుగా ఉన్నారు. అదే విధంగా సిద్దిపేట జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శిగా ఉన్న ఆముదాల మల్లారెడ్డి మూడో సారి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్మిక వర్గ పోరాటాలు, రైతులు, ఇతర ప్రజల సమస్యలపై ఉద్యమాలు చేసి పార్టీని విస్తరించిన సంగారెడ్డి జిల్లాకు కూడా రాష్ట్ర కమిటీలో ప్రాతినిధ్యం లభించింది. పార్టీ జిల్లా కార్యదర్శిగా ఉన్న గొల్లపల్లి జయరాజు తొలిసారి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. అదే విధంగా సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శిగా తూప్రాన్‌లో జరిగిన మహాసభల్లో కడారి నర్సమ్మ ఎన్నికయ్యారు. రాష్ట్రంలోనే పార్టీ కార్యదర్శిగా మహిళ ఎన్నిక కావడం ప్రప్రథమని చెప్పారు. రాష్ట్ర నూతన కమిటీలో భాగంగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యురాలుగా కడారి నర్సమ్మను మహాసభ ఎన్నుకుంది. దీంతో మూడు జిల్లాల పార్టీ కార్యదర్శులుగా ఉన్న ఆముదాల మల్లారెడ్డి, గొల్లపల్లి జయరాజు, కడారి నర్సమ్మ ముగ్గురికి కూడా రాష్ట్ర స్థాయిలో సముచిత స్థానం లభించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సీపీఐ(ఎం) విస్తరణకు ఉపయోగపడుతుందని ఆ పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. సంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో తీసుకున్న ఉద్యమ కర్తవ్యాలను ముందుకు తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర కమిటీకి ఎన్నికైన నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా చుక్క రాములు ఉమ్మడి మెదక్ జిల్లా పార్టీ గైడర్‌గా ఉన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు ఈ నెల 25 నుంచి 28 తేదీల్లో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగాయి. ఈ మహాసభల్లో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శిగా ఉన్న ఆముదాల మల్లారెడ్డి రాష్ట్ర కమిటీకి మూడ సారి ఎన్నికయ్యారు. ఆయన చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ప్రజానాట్య మండలి, రైతు సంఘాల్లో వివిధ స్థాయిల్లో పని చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పని చేస్తూ చేర్యాల పార్టీ శాఖ కార్యదర్శిగా, మండల కార్యదర్శిగా, చేర్యాల డీవిజన్ కార్యదర్శిగా జనగామ డీవిజన్ కార్యదర్శిగా ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా పని చేశారు. జిల్లాల పునర్విభజన అనంతరం సిద్దిపేట జిల్లా కార్యదర్శిగా 2016 నుంచి మూడు పర్యాయాలు ఎన్నికైన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా పార్టీ ఉద్యంలో పనిచేస్తున్నారు. గత నెల డిసెంబరు ఒకటి, రెండు తేదీల్లో గజ్వేల్‌లో జరిగిన సీపీఐ(ఎం) మూడవ మహాసభల్లో జిల్లా కార్యదర్శిగా మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైయారు. విద్యార్థి, యువజన, రైతు, కూలీల సమస్యలతో పాటు అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. చేర్యాల రెండవ వార్డు ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. 2008లో జరిగిన చేర్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో 2014 జనగామ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తున్నారు. రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కమిటీ సభ్యులుగా మూడవసారి ఎన్నికయ్యారు. జిల్లాలో పార్టీ విస్తరణకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యురాలుగా కడారి నర్సమ్మ



నవతెలంగాణ-మెదక్ టౌన్

ఆశాకార్యకర్త నుంచి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యురాలుగా ఎదిగారు. సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 25-28 తేదీల్లో జరిగిన రాష్ట్ర 4వ మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అదే విధంగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యురాలుగా కడారి నర్సమ్మ ఎన్నికయ్యారు. నర్సాపూర్ మండలం, పెద్దచింతకుంట గ్రామంలో నిరుపేద కూలి కుటుంబం కడారి బాషయ్య, యాదమ్మ దంపతులకు నర్సమ్మ, నాగరాజు ఇద్దరు సంతానం. నర్సమ్మ చదువుకునే రోజుల్లోనే అప్పట్లో మదర్ థెరిస్సా జీతం సేవ భావాల వైపు మళ్లారు. టెన్త్ పూర్తవ్వగానే 1994లో అంగన్వాడి టీచర్‌గా చేరారు. టీచర్ ఉద్యోగంలో చేరేందుకు అవకాశమున్నా సీఐటీయూ ప్రజా సంఘంలో పనిచేయాలన్న లక్ష్యంతో టీచర్ ఉద్యోగానికి వెళ్లలేదు. సీఐటీయు, పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు హాజరై అక్కడ బోధించిన పాఠ్యాంశాల ప్రభావంతో కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. అంగన్వాడి టీచర్ ఉద్యోగానికి 2011 సంవత్సరంలో రాజీనామా చేసి పార్టీ ఉద్యమల్లోకి పూర్తి కాలం కార్యకర్తగా పార్టీలోకి వచ్చారు. మెదక్ జిల్లా కోల్చారం మండలంలోని కొంగోడు గ్రామంలో 33 దళిత కుటుంబాలు కోసం చేసిన పోరాటంలో నర్సమ్మ నర్మద అనే మారు పేరుతో పాల్గొని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ధర్నా సందర్భంగా పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. దళితులకు 3 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి, రెండు బోర్లు వేసుకుని పంటలు పండించు కుంటున్నారు. అల్లాదుర్గ్, టెక్మాల్, పాపన్నపేట మండాలకు ఉపయోగ పడే గుండు వాగు సాగు నీరు కోసం ప్రత్యక్షంగా పోరాడారు. సంగారెడ్డి నుండి మెదక్ జిల్లాకు 2016 అక్టోబర్ నెలలో వచ్చారు. పార్టీ జిల్లా కమిటి సభ్యులుగా ,కార్యదర్శి సభ్యులుగా తను భాద్యతలు నిర్వర్తిస్తున్నారు. నవంబర్ 2,3 తేదీలలో తుప్రాన్ పట్టణంలో జరిగిన పార్టీ జిల్లా 15వ మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

లక్ష్మణ్, విశ్వేశ్వరరెడ్డిలకు ఘన స్వాగతం



నవతెలంగాణ-సదాశివపేట

జహీరాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్తున్న బీజేపీ ఎంపీలు లక్ష్మణ్, కొండా విశ్వేశ్వరరెడ్డికి సదాశివపేటలో బీజేపీ నేత నెమలికొండ వేణుమాధవ్ ఆధ్వర్యంలో ముంబై నేషనల్ హైవేపై పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. వారితోపాటు బీజేపీ నాయకులు మర్రి శశిధర్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆదిత్య జిల్లా జనరల్ సెక్రటరీ మాణిక్ రావు, మెదక్ పార్లమెంట్ కన్వీనర్ సంగమేశ్వర్, రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-మనూర్

మాఘం అమావాస్య సందర్భంగా బోరంచ గ్రామంలో గల సంగమేశ్వర్ ఆలయంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవ్ రెడ్డి తన సతీమణి అనుపమతో కలిసి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నదిలో గంగా హారతి అభిషేకం నిర్వహించారు. మందిరానికి వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేశారు. వారితో పాటు శివమాల భక్తులు బ్రహ్మా నందరెడ్డి, విజష్ణు వర్ధన్‌రెడ్డి, రమేష్, సంజీవ్ రెడ్డి, గ్రామస్తులు విట్టల్, మల్లయ్య తదితరులు పూజలు చేసి గంగా స్నానం చేశారు.

చౌటకూర్ ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామలింగం



నవతెలంగాణ-చౌటకూర్

చౌటకూర్ మండలం ఏర్పడిన తర్వాత మొదటి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.రామలింగం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మునిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను.. ఆర్డర్ టు సర్వ్ పేరుతో చౌటకూర్ మండల ఇన్చార్జ్ ఎంపీడీవోగా నియమించారు. ఆయనతోపాటు ఒక టైపిస్ట్, ఇద్దరూ సబార్డినేటర్లను నియమిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా మంగళవారం రోజున ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడు తూ..మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి.. వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందేలా చూస్తానన్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు



నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని మునిదేవునిపల్లి గ్రామ సర్వేనెంబర్ 60లో హైదరాబాద్‌కు చెందిన బడా రియాల్టర్ ఆనంద్‌కుమార్‌రెడ్డి తన వ్యవసాయ పొలంలో నాలా కన్వర్షన్ లేకుండా బిల్డింగ్ నిర్మాణాల కోసం పనులు చేపడుతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలో దాదాపు 20 రోజుల నుంచి సర్వేనెంబర్ పై ఓవైపు రైతులు, రియాక్టర్ల మధ్యల గొడవలు జరుగుతున్నా నిర్మాణాలు మాత్రం ఆగడం లేదని.. పంచాయతీ సెక్రెటరీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇకనైనా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.



ప్రజాస్వామ్యానికి మూలస్తంభం మీడియా

జర్నలిస్ట్ డైరీ ఆవిష్కరణలో కలెక్టర్ క్రాంతి వల్లూరి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజాస్వామ్యంలో మీడియా రంగం అత్యంత ప్రాధాన్యత కలిగిందని.. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం మీడియా అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. సంగారెడ్డిలోని కలెక్టర్ ఛాంబర్‌లో సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ 2025 నూతన సంవత్సర డైరీని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు, పాలకులకు వారధిగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం అందించడం గొప్ప విషయమన్నారు. టెక్నాలజీకి అనుగుణంగా మీడియా రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకొని రిపోర్టర్లు పనిచేస్తున్నారని మెచ్చుకున్నారు. సమాజం కోసం నిరంతరం పనిచేస్తున్న విలేకరులు ఆదర్శప్రాయులని కొనియాడారు. ఈ సందర్భంగా అందరినీ పలకరించి, మీడియా రంగంలో వస్తున్న మార్పులు, సమస్యల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్ట్ డైరీలో జిల్లాకు సంబంధించిన జిల్లా జర్నలిస్టు ప్రతినిధుల, ఫోటో జర్నలిస్టు వీడియో జర్నలిస్టుల, జిల్లా అధికారులు, పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్ల మంచి సమాచారంతో రూపొందించిన అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సాయినాథ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ సలహాదారుడు సునీల్, గౌరవ అధ్యక్షులు శంకర్రావు, ఉపాధ్యక్షులు ఎర్ర వీరేందర్ గౌడ్, రాజ్ కిషోర్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి నాగభూషణం, అసోసియేషన్ సభ్యులు, పుండరీకం, లక్ష్మణ్, నర్సింలు, సంగమేశ్వర్, రాజేష్, బక్కప్ప, ప్రవీణ్, అంజిరెడ్డి, సకినాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధను అందిపుచ్చుకోవాల్సిందే

- **బ్రిటన్ షెఫీల్డ్ విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు డాక్టర్ ప్రీతి రఘునాథ్**

నవతెలంగాణ-పటాన్‌చెరు



అధునాతన పరిజ్ఞానాలైన కృత్రిమమేధ (ఏఐ), ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ)లను భారతీయులు కూడా అందిపు చ్చుకోవాలని, అత్యంత ఖర్చు, వ్యయప్రయాసలతో కూడినదైనా దానిని వదులుకోవద్దని బ్రిటన్, షెఫీల్డ్ విశ్వవిద్యాలయంలోని డిజిటల్ మీడియా అధ్యాపకురాలు డాక్టర్ ప్రీతి రఘునాథ్ అభిప్రా యపడ్డారు. 'తెలంగాణలో కృత్రిమ మేధ విధానాలు, మౌలిక సదుపాయాలు, అభ్యాసాలు: ప్రారంభ ముద్రలు' అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లో బుధవారం ఆమె పలు అంతర్దృష్టులను పంచుకున్నారు. రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘునాథ్ తన పైలట్ పరిశోధన అధ్యయనం ప్రారంభ ఫలితాలను వివరించారు. ముఖ్యంగా, నిజామాబాద్, హైదరాబాద్ నుంచి రెండు కీలక కేస్ స్టడీలను ఆమె ప్రముఖంగా ప్రస్తావిస్తూ, తెలంగాణలో కృత్రిమ మేధ సంక్లిష్ట దృశ్యాన్ని ఆవిష్కరించారు. ఈ స్థానిక ఉదాహరణలను జాతీయ, అంతర్జాతీయ ఏఐ అభివృద్ధి యొక్క విస్తృత చట్రాలలో పరిశీలించారు.వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రంగంలో తెలంగాణ పథం యొక్క క్లిష్టమైన విశ్లేషణలను డాక్టర్ రఘునాథ్ అందించారు. జీవనోపాధి, అభివృద్ధి మధ్య సంక్లిష్ట పరస్పర చర్య, సామాజిక-పర్యావరణ పరిగణనలు, దక్షిణ అర్ధగోళంలో (గ్లోబల్ సౌత్) అభివృద్ధి చెందు తున్న దేశాల యొక్క చిక్కులను వివరించారు. ఆర్థిక వృద్ధి, స్థిరమైన అభివృద్ధి మధ్య సమతుల్యత, ఏఐ ప్రపంచ కథనంలో స్థానిక సందర్భాలను గుర్తించడం ప్రాముఖ్యతలను ప్రస్తావించారు. చారిత్రక వ్యాపారం-సాంకేతిక కథనాలను గుర్తించడం, యూరో-అమెరికన్ దృక్కోణాలను దాటి వెళ్లడం, సాంకేతిక పురోగతిలో ప్రత్యక్ష అనుభవాలను అర్థం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.తొలుత, జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్ అతిథిని ఆహ్వానించి, విద్యార్థులకు పరిచయం చేశారు. కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ జి.అశోక్ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలి

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ మాధురి

రాత్రి బస చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు

నవతెలంగాణ-పటాన్ చెరు



విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ మాధురితో కలిసి మండలంలోని ఇస్నాపూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురు గురుకుల పాఠశాలలో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. వారిరువురు విద్యార్థులకు, తమ విద్యాభ్యాసం, తాము ఏర్పాటు చేసుకున్న లక్ష్యాన్ని ఎలా చేరుకున్నది వివరించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు తాను ఇంటర్ చదివే సమయం నుంచే ఐఐటీలో సీటు సాధన కోసం శ్రమించానని తెలిపారు. మాథ్స్ కెమిస్ట్రీలో అత్యధిక శాతం మార్కులు రావడంతో జేఈఈ ఎంట్రన్స్ లో 938 ర్యాంకు రావడంతో ఢిల్లీ ఐఐటీలో సీటు వచ్చినట్లు అనంతరం కుటుంబ సభ్యులు బంధువుల సూచన మేరకు ఐఏఎస్‌కు ప్రిపేర్ కావడం ఐఏఎస్ లో ర్యాంకు వస్తే ఎంతోమంది ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కుతుందన్న ఉద్దేశంతో ఐఏఎస్ సాధన కోసం శ్రమించినట్లు కలెక్టర్ తెలిపారు. సివిల్స్ పరీక్షల్లో ర్యాంకు సాధించడం కోసం తాను శ్రమించిన విధానం విద్యార్థులకు తెలిపారు. అదనపు కలెక్టర్ మాధురి తాను పెళ్లి అయిన తర్వాత కష్టపడి చదివి ప్రభుత్వ గ్రూప్ 1, ఉద్యోగం సాధించిన తీరును వివరించారు. తాను ఒకవైపు సాఫ్ట్వేర్ కంపెనీలో పనిచేస్తూ ఎలాంటి కోచింగ్ లేకుండానే ఇంటివద్దె పిల్లలను చూసుకుంటూ గ్రూప్ వన్ ఉద్యోగం సాధించిన తీరును అదనపు కలెక్టర్ వివరించారు. విద్యార్థి దశలో కష్టపడి చదువుతూ అనుకున్న ఉన్నత లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని వారు విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో విద్యార్థులు ఏఏ కోర్సులు చదివితే ఎలాంటి ఉపాధి అవకాశాలు ఉంటాయో విద్యార్థులు ఇప్పటి నుండి అవగాహన కల్పించుకోవాలని అన్నారు. వివిధ కోర్సులు ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమా నిర్వహించాలని ఉపాధ్యాయ బృందానికి కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్లు విద్యార్థులతో కలిసి నిద్రించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో, అధ్యాపకు బృందం ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

- ఏడుమంది కార్మికులకు తీవ్ర గాయాలు
- క్షతగాత్రులంతా యూపీ, బీహార్, మధ్యప్రదేశ్‌కు చెందిన వారే..

నవతెలంగాణ-జహీరాబాద్




ఒకవైపు ప్రభుత్వం, పోలీస్ అధికారులు రోడ్డు సేఫ్టీ వారోత్సవాలు నిర్వహిస్తున్న తరుణంలో మరోవైపు జాతీయ రహదారి 65పై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కార్మికులతో వెళ్తున్న ఆటోను ఓ లారీ అతివేగంగా ఢీకొట్టింది. దాంతో ఆటోలో ఉన్న ఎనిమిది మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై కాశీనాథ్, క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ముస్కో పరిశ్రమలో విధులు ముగించుకొని ఏడుమంది కార్మికులు టీఎస్ 15యూడీ5917 నెంబర్ గల ఆటోలో జహీరాబాద్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో ముంబై నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఏపీ16టీవై 924 నెంబర్ గల లారీ అతివేగంగా, జాగ్రత్త వచ్చి ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రమోద్, కమలేష్, శివేంద్ర, దేవేందర్, సురేష్ చౌహాన్ అనే కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహు టినా జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలకు తీసుకెళ్లి.. ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం కర్ణాటక, హైదరాబాద్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

క్షతగాత్రులకు సీఐటీయూ నాయకుల పరామర్శ

ఈ ప్రమాద విషయం తెలియగానే.. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్, ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డిలు క్షతగాత్రులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు విజ్ఞప్తి చేశారు. పరిశ్రమ యజమాన్యంతో చర్చించి కార్మికులకు కావాల్సిన సహాయ సత్కారాలు అందించాలని ఆదేశించినట్టు తెలిపారు.

మాజీ మంత్రి చంద్రశేఖర్‌ని కలిసిన మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ-జహీరాబాద్



ఫిబ్రవరి 7న హైదరాబాద్ నగరంలో నిర్వహించబోయే లక్ష డప్పులు- వేల గొంతులు కార్యక్రమా నికి రావాలని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ నివాసానికి వెళ్లి మందకృష్ణ మాదిగ ఆహ్వానించారు. కాగా మంద కృష్ణ మాదిగకి పద్మశ్రీ పురస్కారం వచ్చిన సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జాతి ప్రయోజనాల కోసం అందరం కలిసికట్టుగా ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఉంటామని.. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు వెలుబడిన వెంటనే దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో వర్గీకరణ చేపడాతామని ప్రకటిం చారన్నారు. దానికి అనుగుణంగానే ప్రభుత్వంతో వర్గీకరణ చేపించే బాధ్యత తనదే అని హామీ ఇచ్చారు. లక్షల డప్పులు లక్షలాది మంది జీవితాలను ప్రభావి తం చేయబోతున్నదని.. ఫిబ్రవరి 7న ఛలో హైదరాబాద్ కార్యక్ర మానికి లక్షలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వట్‌పల్లిలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రమైన వట్‌పల్లిలో లయన్స్ క్లబ్ వట్‌పల్లి.. సంగారెడ్డి న్యూరో ఆసుపత్రి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను న్యూరో ఆసుపత్రి డాక్టర్ కృష్ణమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా ర్థులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు తారతమ్యం లేకుండా క్రీడలో పాల్గొనడం సంతోకరమన్నారు. ముగింపు వరకు సామరస్యంగా క్రీడలు నిర్వహించుకోవాలన్నారు. కాగా ఈ పోటీల్లో ముందుగా మెదక్ జిల్లా రేగోడు మండల జట్టుతో వట్‌పల్లి పోలీస్ స్టేషన్ జట్టు తలపడింది. రేగోడు జట్టుకు కెప్టెన్‌గా షఫీ, వట్‌పల్లి పోలీస్ స్టేషన్ జట్టుకు కెప్టెన్‌గా ప్రతాప్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రేగోడు మండల మాజీ ఎంపీపీ పత్రి విట్టల్, మాజీ సర్పంచ్ సంగారెడ్డి డాక్టర్ కృష్ణమూర్తి అనుచరుడు శ్రీనివాస్, వట్టిపల్లి మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు వెంకట్, రిటైర్మెంట్ ఉపాధ్యాయులు కాచూర్‌రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మొహినోదిన్, పెద్దన్న, దిగంబర్ రావు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిలో సెక్రెటరీల పనితీరు కీలకం

నవతెలంగాణ-మెదక్ : గ్రామపంచాయతీల అభివృద్ధిలో సెక్రటరీల పాత్ర కీలకంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో డివిజనల్, మండల స్థాయి పంచాయతీ అధికారులు, గ్రామ పంచాయతీ సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామాలలో ప్రతిరోజు నిర్వహించే శానిటేషన్, హౌస్ టాక్స్ కలెక్షన్, గ్రామపంచాయతీ ఇన్స్పెక్షన్లు, ట్రేడ్ లైసెన్స్, సెల్ టవర్ లైసెన్స్, ఇంటి పరిమిషన్లు, మల్టీపర్పస్ వర్కర్స్ శాలరీలు సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పంచాయతీ సెక్రటరీలు సంక్షేమ పథకాల అమలులో వారి పని తీరు హర్షనీయమని, ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ పని చేయాలన్నారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత, మురుగు కాలవలు, రోడ్లు, పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, తడి చెత్త పొడి చెత్త ట్రాక్టర్ ద్వారా కలెక్ట్ చేయడం సమర్థవంతంగా నిర్వహించాలన్నారు సంక్షేమ పథకాల ఆన్లైన్ డేటా ఎంట్రీలో 100% పురోగతి సాధించాలని, సెక్రటరీలు సమయపాలన పాటించాలన్నారు. వీధి దీపాలు తప్పనిసరిగా వెలిగే విధంగా చూడాలని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి, ఎటువంటి ఒత్తిడిలకు లోను కాకుండా పారదర్శక సేవలు అందించాలని సూచించారు. గ్రామాలు స్వచ్ఛతకు నిలయాలుగా మారాలని పంచాయతీ సెక్రటరీల పనితీరుతోనే అది సాధ్యపడుతుందని కలెక్టర్ హితబోధ చేశారుజ ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారి సురేష్, డిఎల్‌పిఓ నరసాపూర్ సాయిబాబా, తూప్రాన్ యాదయ్య, ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మైత్రి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలో మైత్రి ఫౌండేషన్ నిర్వహిస్తున్న విద్య, వైద్యం సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ ప్రశంసించారు. ట్రస్ట్ చైర్మెన్ చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్ ఆయన్ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఫౌండేషన్ ద్వారా మండల ప్రజలకు అందజేస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యా, ఆరోగ్య రంగాలు అత్యంత కీలకమైనవని.. మైత్రి ఫౌండేషన్ వాటిపై తీసుకుంటున్న చొరవ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని అభినందించారు. ఆయన తోపాటు ట్రస్ట్ సభ్యులు నవీన్ సాగర్ తదితరులున్నారు.

ఆర్ఆర్‌బి, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బి, ఎస్ఎస్‌సి మరియు బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సుకు ఉచిత కోచింగ్‌ను సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్నట్టుజిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. జగదీశ్ తెలిపారు. ఫిబ్రవరి 15వ తారీఖు నుంచి 100 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. అర్హులైన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా వచ్చేనెల తొమ్మిదో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాగా అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం సంవత్సరానికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండా లన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ఉంటుంద న్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ వచ్చేనెల 12 నుంచి 14 వరకు ఉంటుం దన్నారు. మరిన్ని వివరాలకు 08455-277015, 9949592991 నెంబర్లను లేదా సంగారెడ్డిలోని బైపాస్-రోడ్డులో గల బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని కోరారు.



కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సంగారెడ్డి

కల్లుగీత కార్మిక సంఘం నూతన క్యాలెండర్‌ను సంగారెడ్డి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ తన కార్యాలయంలోబుధవారం ఆవిష్కరించారు. ఆయన తోపాటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, ఏఈఎస్ శ్రీనివాస్ రావు, సంగారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ నజీర్ పాషా, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, సంగారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్, జిల్లా నాయకులు జగన్‌గౌడ్, కమలాకర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీ కాని రైతులకు బ్యాంకు నోటీసులు

నవతెలంగాణ-మనూర్

రుణమాఫీ జరగని తమకు బ్యాంకు నుంచి నోటీసులు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం రుణ మాఫీ చేస్తుందని ఆశపడితే నిరాశే మిగిలిందని వాపోతు న్నారు. ఎన్నికల సమయంలో రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పారని.. కానీ ఆ మేరకు అమలు జరగలేదని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ జరగని తమకు తెలంగాణ వికాస బ్యాంకు మనూర్ అధికారులు నోటీసులు మీద నోటీసులు పంపిస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాఫీ కోసం ఎదురుచూస్తే అప్పు పెరుగు తుంది తప్పా.. మాఫీ పైన ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం చెప్పడం లేదని మండి పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రుణ మాఫీ చేసి రైతులకు ఆడుకోవాలని కోరుతున్నారు.

న్యాల్‌కల్ ఎంపీఓపై బదిలీ వేటు

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్‌కల్ ఎంపీఓ సురేష్‌పై బదిలీ వేటు పడింది. ఆయనపై వచ్చిన ఆరోపణలు.. పంచాయతీ సెక్రటరీల ఫిర్యాదుతో జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేశారు. ఆ నివేదిక జిల్లా అధికారులకు పంపించగా.. కలెక్టర్ వల్లూరి క్రాంతి ఎంపీఓ సురేష్‌కు చార్జ్ మెమో జారీ చేశారు. అంతేకాకుండా సిర్గాపూర్ మారుమూల మండలానికి ఆయన్ను బదిలీ చేశారు.



ఉపాధి హామీ సిబ్బందికి జీతాలు చెల్లించాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఉపాధి హామీలో పనిచేస్తున్న తమకు మూడు నెలల నుంచి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. వెంటనే వేతనాలు చెల్లించాలని కోరుతూ ఈజీఎస్ ఏపీవో, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో రాజశేఖర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఆత్మీయ భరోసా పథకాన్ని విజయవంతం చేశామని.. అలాంటి తమకు వెంటనే జీతాలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏపీఓ రంగారావు, ఫీల్డ్ అసిస్టెంట్ల అధ్యక్షులు అబ్బాస్, జగనాథ్ రెడ్డి, సుకుమార్, విట్టల్, వైద్యనాథ్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.



బండి సంజయ్ వ్యాఖ్యలు అర్ధరహితం

నవతెలంగాణ-సదాశివపేట

ప్రజా గాయకుడు గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి వ్యాఖ్యలు అర్ధరహితమని ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం కోసం, రాష్ట్రం కోసం పాట రూపంలో ప్రజలను చైతన్యం చేసిన గద్దర్ పై కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ చౌకబారు మాటలు మాట్లాడుతున్నారన్నారు. బండి సంజయ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గద్దర్ ఎల్టీటీఈ తీవ్రవాది అని ఏపీ బీజేపీ నేత విష్ణు వర్ధన్‌రెడ్డి మాట్లాడడం దుర్మార్గమన్నారు. బీజేపీ నేతలకు ప్రజలు, తెలంగాణ ప్రజలు గుణ పాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పద్మ అవార్డులు బీజేపీ సొంతమా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమేష్, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.



ఈస్టర్ గుట్ట నిర్మాణ పనుల పరిశీలించిన మాజీ జెడ్పీటీసీ

నవతెలంగాణ-న్యాల్ కల్

మండలంలోని హద్నూర్ గ్రామంలో గల ఈస్టర్ గుట్ట వద్ద ప్రతీయేడు నిర్వహించే క్రైస్తవ ఉజ్జీవ కూటముల జాతర ఉత్సవ పనులను న్యాల్‌కల్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు స్వప్నభాస్కర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతర కోసం జరిగే ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 21,22,23 తేదీల్లో జరిగే క్రైస్తవ ఉజ్జీవ కుటముల జాతర ఉత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం అన్నీ వసతులు కల్పించాలని కోరుతూ.. తన వంతు సహాయ సహకారాలు కూడా అందిస్తానన్నారు. ఈ జాతరకు మండలం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు స్వామిదాస్, నర్సిమ ులు, సుందర్, ఆనందం, ప్రణీత్, రోషన్, సురేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లాపూర్ 'జీ' బ్లాక్‌లో.. కబ్జాల పర్వం





- యథేచ్ఛగా సిరిమాయకుంటలో కాలువలు, కుంటల ఆక్రమణ
- అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు నామమాత్రం!

నవతెలంగాణ-రామచంద్రాపురం

హైదరాబాద్ నగరానికి కూటవేత దూరంలో ఉన్న తెల్లాపూర్‌లో ప్రకృతి సహజసిద్ధంగా ఉన్న వనరులు కబ్జాలకు గురవుతున్నాయి. ఒకవైపు అక్రమ కట్టడాలు, కబ్జాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో చర్యలు తీసుకుంటున్నప్పటికీ తెల్లాపూర్‌లో నాయకులు, అధికారుల సహకారంతో భూ కబ్జాదారులు యథేచ్ఛగా కబ్జాలకు, ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇక్కడ భూముల ధరలు ఆకాశాన్ని అందడంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా కబ్జాలపై కన్నేశారు.

రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లి పెద్దచెరువు నుంచి వర్షపు నీరు గొలుసుగట్టు కాలువ కుమ్మరికుంట, సిరిమాయకుంట మీదుగా వనం చెరువులోకి వచ్చి చేరుతుంది. తెల్లాపూర్ జీ బ్లాక్ వద్ద గొలుసుగట్టు 33 అడుగుల వెడల్పుతో ఉన్న కాల్వ వద్ద ఇటీవల కొందరు పైపులు మొరం మట్టితో పనులు చేస్తూ కబ్జా చేసేందుకు పెద్ద ఎత్తున వాహనాలు, పనిముట్లతో పనులు చేపట్టారు. స్థానికుల సమాచారంతో ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేశారు. అయినప్పటికీ రాత్రికి రాత్రి అక్కడ యథేచ్ఛగా పనులు చేసుకుంటున్నారు. నాయకులు, అధికారుల అండదండలతో పనులు ఏమాత్రం ఆపకుండా వేగవంతం చేసి పైపులు, మొరం మట్టి వేస్తూనే పనులు సాగిస్తున్నారని స్థానకంగా పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు తూతూ మంత్రంగా కేసు నమోదుతో కాకుండా వేసిన పైపులు తొలగించి కాలువ మునుపటిలా ఉండేలా చూడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. స్థానిక అధికారులు కఠినంగా వ్యవహరించకుంటే ప్రకృతి సిద్ధంగా వచ్చే నీరు రాకుండా చెరువులు, కుంటలు జీవం లేకుండా పోయే ప్రమాదం వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లేనియెడల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కబ్జాదారులు వారి స్వలాభం కోసం ప్రకృతి విరుద్ధంగా పనులు చేపట్టి కుంటలను కాలువలను కబ్జా చేస్తే రాబోయే తరాలకు నీళ్ల దొరకని పరిస్థితి నెలకొనే ప్రమాదం నెలకొంది. అధికారులారా కబ్జాదారులకు సహకరించకండి.. జాగ్రత్తలు తీసుకోండి, పర్యావరణాన్ని పరిరక్షించండి.. నీటిని సంరక్షించండి అని విజ్ఞప్తి చేస్తున్నారు.



వరద కాలువలను కాపాడండి



ప్రకృతి సిద్ధమైన వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. వరద కాలువల ద్వారా చెరువు లు నుండి భూగర్భ జలాలు సురక్షితంగా ఉండేవిధంగా అందరూ ప్రయత్నించాలి. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా ప్రకృతి వనరులను కాపాడుకుందాం.

-వడ్డే నర్సింలు, మాజీ సాగునీటి సంఘం చైర్మెన్

అధికారులు పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలి



కాలువలు, కుంటలు కబ్జాలకు యత్నిస్తున్న కబ్జాదారులపై అధికారులు పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలి. అధికారుల వైఫల్యంతోనే కబ్జాదారులు తమ ఇష్టానుసారంగా ప్రకృతి వనరులను సైతం కబ్జాలు చేస్తూ కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో భూములు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఎంతైనా ఉంది.

- మల్లేపల్లి బుచ్చిరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్

జీ ' బ్లాక్ లో కబ్జాలను ఆపండి



తెల్లాపూర్ మున్సిపాల్టీలోని 'జీ' బ్లాక్ లో జరుగుతున్న కబ్జాలను అధికారులు ఆపి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ అధికారులు తమ పనులను సక్రమంగా నిర్వహించి కబ్జాలు కాకుండా భూములను సంరక్షించాలి. కోట్ల విలువచేసే భూములు కబ్జాలకు గురవుతున్నా అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం సరికాదు.

-గుట్ల సాగర్, మాజీ వార్డ్ మెంబర్

మాదకద్రవ్యాల నిర్మూలనలో జిల్లాకు గుర్తింపు

- రివార్డులతో ఉన్నతాధికారుల ప్రశంసలు..
- మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్ ఎస్పీ రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి



మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ చెన్నూరి రూపేష్ అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుమ్మడిదల పోలీసు స్టేషన్‌కు చెందిన ఆల్ప్రాజోలం కేసులో నిషేధిత ఆల్ప్రాజోలాన్ని తయారు చేస్తున్న ముఠాను పట్టుకొని, సుమారు రూ.60 కోట్ల విలువగల ఆల్ప్రాజోలేతర ఆస్తులను గుర్తించినందుకు గాను సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖను తెలంగాణ రాష్ట్ర నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్/డిజి సందీప్ శాండిల్యా అభినందించారన్నారు. ఈ కేసు చేధనలో కీలకంగా వ్యవహరించిన అధికారులకు రివార్డులను అందించడం జరిగిందన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ముందు ముందు మరిన్ని మంచి ఫలితాలు రాబట్టి డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. విపరీతంగా పెరిగిన డయల్ -100 కాల్స్ ద్వారా, ట్యాబ్‌ల టెక్నికల్ సమస్యల వలన ఎదుర్కొం టున్న సమస్యను అధిగమించడానికి, డయల్ -100 కాల్స్ కు త్వరితగతిన స్పందించడానికి గాను అన్నీ పెట్రో కార్‌లకు, ప్రధాన పోలీసు స్టేషన్‌లకు 20-నూతన ట్యాబ్‌లను అందించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లను నిర్వహించడానికి 10-బ్రీత్ అనలైజర్ కిట్లను, మరియు ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి నాన్-కాంటాక్ట్‌గా ఫైన్ విధించడానికి గాను 5-హ్యాండి కెమెరాలను అందించామన్నారు. అనంతరం క్రైమ్ రివ్యూలో భాగంగా పెండింగ్ (అండర్ ఇన్వెస్టిగేషన్) లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆస్తి సంబంధిత నేరాలకు సంబంధించి పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. ఇన్‌స్పెక్టర్స్ సర్కిల్ పరిధిలో ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేసుకొని, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న యన్ బిడ బ్ల్యూస్, మిస్సింగ్ కేసులను ఛేదించాలన్నారు. ఎన్‌డీపీ ఎస్ కేసుల్లో నేరస్తులపై హిస్టరీ షీట్స్ ఓపెన్ చేయాలని, వాణిజ్య పరంగా 20 కిలోల బరువు కలిగిన గంజాయిని అక్రమ రవాణా చేసిన గంజాయి స్మగ్లర్ల ఆస్తులను కోర్టుకు అటాచ్ చేయాలని, అలవాటు పడిన నేరస్తులపై పిట్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ కు సిఫార్సు చేయాలన్నారు. డ్రగ్ దుర్వినియోగం, ఆన్లైన్ మోసాల గురించి జిల్లా ప్రజలలో, విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలన్నారు. రైతులు ఎవరైన గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అలవాటు పడిన నేరస్తులపై పిడి యాక్ట్ నమోదు చేయాలన్నారు. ఆన్లైన్ మోసాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్లైన్ మోసాలకు గురైతే 1930లేదా ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.రోడ్డు ప్రమాదాలనివారణకు ప్రత్యేక దృష్టి సారించి, ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగు తున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లు గా గుర్తించి, సైన్ బోర్డులను ఏర్పాటు చేయించాలని సూచించారు. హైవే రోడ్లను కలుపుతూ ఉండే లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్స్ వేయించడం, రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలిగించే విధంగా చూడాలన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ లో లోపాలున్నట్లయితే నేషనల్ హైవే అథారిటీకి లేక రాయలని అన్నారు. ఫేక్ నెంబర్ ప్లేట్స్, నెంబర్ ప్లేట్స్ మార్పు పై ప్రత్యేక దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వాహనదారులతో మర్యాదగా మాట్లాడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, జహీరాబాద్ డీఎస్పీ రామ్ మోహన్ రెడ్డి, నారాయణ ఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సైబర్ క్రైమ్ డియస్పీ వేణు గోపాల్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, జిల్లా ఇన్‌స్పెక్టర్స్, సబ్‌ఇన్స్పెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌జీటీయూ డైరీని ఆవిష్కరించిన నీలం మధు

నవతెలంగాణ-జహీరాబాద్

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం నూతన డైరీని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల కిష్టయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆకుల ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య, మెదక్ జిల్లా అధ్యక్షులు జింక అశోక్ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అమృత్, నాయకులు ఉన్నారన్నారు. ఉపాధ్యాయ సమస్యలను మరియు ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న వివిధ సమస్యలను నీలం మధు దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. అందుకు ఆయన స్పందిస్తూ త్వరలో సీఎంను కలిసి ఈ సమస్యలను వివరిస్తానని హామీ ఇచ్చారన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

రోడ్డు భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరు తూ.చా తప్పకుండా పాటించాలని ఎస్సై కోటేశ్వరరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పటాన్ చెరు పారిశ్రామిక వాడలో గల ఏఆర్ ఎల్ టైర్స్ పరిశ్రమ ప్రైవేట్ లిమిటెడ్ (అగర్వాల్ రబ్బర్ పరిశ్రమ)లో రోడ్డు భద్రతపై కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కోటేశ్వరరావు మాట్లాడుతూ.. వాహనాలను నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్టు పెట్టుకొని వాహనం నడపాలన్నారు. మద్యం సేవించి నడపడం, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్లో వాహనాలను నడపొద్దన్నారు. ఎస్సై ఆసిఫ్ అలీ మాట్లాడుతూ వాహనాలను నడుపుతున్నప్పుడు మీ కుటుంబంతో పాటు ఇతర కుటుంబాలను సైతం దృష్టిలో ఉంచుకొని బాధ్యతతో వాహనాలను నడపాలన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు బైకులపైనే వెళుతుంటారని తప్పనిసరిగా హెల్మెట్ ధరించే వెళ్లాలన్నారు. దీనితోపాటు వాహనాలు నడిపేట ప్పుడు తప్పనిసరిగా సంబంధిత పత్రాలు(లైసెన్సు, ఇన్సూరెన్స్) కలిగి ఉండాలన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి ఇతర మానప్రాణాలతో చెలగాటమాడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ఎడ్ నాగరాజరావు, హెచ్ఆర్ మేనేజర్ కిషోర్, ఏఎస్ఐ అక్బర్‌ఖాన్ యూనియన్ నాయకులు రామకృష్ణ, నారాయణ కార్మికులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమమే డీడీఎస్ లక్ష్యం



నవతెలంగాణ-జహీరాబాద్

గిరిజనుల సంక్షేమానికి డీడీఎస్ ఎంతో కృషి చేస్తున్నదని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.దివ్య అన్నారు. మండలంలోని జీడిగడ్డతాండాలో బుధవారం జరిగిన పాత పంటల జాతరకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. నాడు గిరిజనులు డీడీఎస్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై.. నేడు పాతపంటల జాతరలో భాగంగా వారి గ్రామాల్లో తృణధాన్యాల ప్రావిణ్యతను చాటి చెబుతూ ఊరేగించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చిన్నచిన్న కమతాలు కలిగిన గిరిజనులందరిని ఐక్యపరిచి తృణధాన్యాలు పండించేందుకు తమవంతు సహకారం చేస్తున్నామన్నారు. ఇప్పటికే జహీరాబాద్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల్లోని గ్రామాల్లో, తాండాల్లో జాతర కొనసాగుతున్నదన్నారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న జాతర కార్యక్రమానికి ఆ వర్గాల నుంచి వస్తున్న స్పందన చూసి వచ్చే సంవత్సరం జాతరలో ఇంకా మెరుగైన కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఈ విషయమై జాతరలో వస్తున్న ప్రతిపాదనలన్నింటినీ తమ కమిటీ సభ్యుల ముందు చర్చకు పెట్టి ప్రజా ఉపయోగానికి అవసరం ఉన్న వాటిని ఇకముందు పరిగణి లోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మాణిక్యం, జాతర కోఆర్డినేటర్లు వినయ్‌కుమార్, మంజుల, చిన్న నరమ్మ, చుక్కమ్మ, కె.విజయ శాస్త్రవేత్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందోలులో కారు బీభత్సం

- ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ- జోగిపేట



అందోల్ మండలం జోగిపేటలోని హనుమాన్ చౌరస్తా వద్ద బుధవారం కారు బీభత్సవం సృష్టించింది. వేగంగా వచ్చిన కారు.. ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాలను బలంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన మొగులయ్య తన డ్రైవర్‌తో కలిసి కారులో ప్రభుత్వ ఆసుపత్రి వైపు నుంచి మెయిన్‌రోడ్డుకు వెళ్తున్నాడు. అయితే అప్పటికే మద్యం సేవించిన డ్రైవర్ అబ్దుల్ ఈస కారును కుడివైపునకు వెళ్లాల్సి ఉండగా.. రోడ్డు మీద ఎదురుగా రెండు ద్విచక్రవాహనాలను ఢీకొడుతూ దుకాణాల వైపు దూసుకు వెళ్లింది. అక్కడే ఉన్న టీడీపీకి చెందిన జెండా గద్దెను ఢీకొట్టి పల్టీ కొట్టింది. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే కారును నిలబెట్టగా కారులో ఉన్న మొగులయ్య డ్రైవర్ ఈసలు క్షేమంగా బయటకు వచ్చారు. ఈ సంఘటనలో కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన బేగరి బాలయ్య సంజీవయ్య అక్సాన్‌పల్లికి చెందిన రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానికులు జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్సలు చేసిన అనంతరం వారిని సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ గౌస్ సంఘటన స్థలానికి చేరుకొని డ్రైవర్‌ను, కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జోగిపేట పోలీసులు కేసును ధర్యాప్తు జరుపుతున్నారు.

బర్దిపూర్‌లో ఉపాధి కూలీల సంబురాలు

నవతెలంగాణ-ఝరాసంగం



మండలంలోని బర్దిపూర్ ఉపాధి హామీ కూలీలు బుధవారం సంబురాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు పథకాల అమలులో భాగంగా బర్దిపూర్ గ్రామాన్ని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. దాంతో మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలకు ఆత్మీయ భరోసా కింద 77 మంది ఎంపిక కాగా వారి ఖాతాల్లో రూ.6 వేల చొప్పున నగదు జమ అయింది. దాంతో బర్దిపూర్ ప్రధాన రహదారిపై సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి 'ధన్యవాదాలు సీఎం సార్' అంటూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి 592 మంది రైతులకు రైతు భరోసా కింద రు.67 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు. గ్రామంలోని 303 ఇందిరమ్మ గృహాలు, దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డులు మంజూరయ్యాయన్నారు. ఇందిరమ్మ గృహాలకు సంబంధించిన మంజూరు పత్రాలను అధికారులు సిద్ధం చేశారన్నారు. బర్దిపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడంపై రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, ఝరాసంగం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతరావు పాటిల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ అడ్డా వద్ద అన్నదానం-అల్పాహారం

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డిలోని మోర్ సూపర్ మార్కెట్ వద్దగల లేబర్ అడ్డా వద్ద ఉదయం 8.30లకు అమావాస్య అన్నదానం-అల్పాహారం కార్యక్రమంలో భాగంగా రోజువారి కూలీలకు 300 మందికి వేడి వేడి జొన్న రొట్టెలు, పప్పు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి విద్యాసాగర్, పుల్లూరి ప్రకాష్, ఇరుకుళ్ళ ప్రదీప్ కుమార్, నామా భాస్కర్, నామా శ్రీనివాస్, బుస్స నాగరాజు, మధు, కొత్త రవీందర్, చంద్రశేఖర్, చెన్న ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

వేతనాల్లేక తీవ్ర ఇబ్బందులు

నవతెలంగాణ-న్యాల్‌కల్



రెండు నెలలుగా గౌరవ వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు వాపోయారు. దాంతో కుటుంబ పోషణ భారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి తమ వేతనం అందజే యాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రవి, సంగమేశ్వర్, మోహన్, రాజు, విజయ్, ఎస్ఎస్ ఏ ఉద్యోగులున్నారు.

మహిళా ఎమ్మెల్యేను విమర్శించడం సిగ్గుచేటు

- మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త



నవతెలంగాణ-శివ్వంపేట

అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు తిరస్కరించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి ఎమ్మెల్యే సునితా రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటని మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త, మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ అన్నారు. బుధవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంత్రిగా సేవలందించి, తెలంగాణ రాష్ట్రానికి తొలి మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా రాష్ట్ర ప్రజలకు సేవలందించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి అని తెలిపారు. ఎన్నికలలో ప్రజలకిచ్చిన హామీలను ఎగ్గొడుతూ కేవలం ఫోటోలలో పోజుల కోసం ప్రోటోకాల్‌ను విస్మరిస్తున్న రాజిరెడ్డికి ఎమ్మెల్యేను విమర్శించే హక్కు లేదన్నారు. మహేష్ గుప్త మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, వాగ్దానాలను అమలు చేసే పనిని వదిలి పెట్టి ప్రోటోకాల్ విషయమే తెలియని ఆవుల రాజిరెడ్డి చట్టసభకు ఎన్నికైన ఎమ్మెల్యేను విమర్శించడం దారుణమన్నారు. ఎమ్మెల్యే జోలికొస్తే మాత్రం ఊరుకోమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పద్మ వెంకటేష్, ఒర్రె శ్రీనివాస్ యాదవ్, కములయ్యగారి అర్జున్, వర్గంటి రమేష్ గుప్త, ముద్దగల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కలప రవాణాకు అడ్డు కట్ట

- అనుమతులు లేని కలప లారీ, ఫారెస్ట్ అధికారుల స్వాధీనం



నవతెలంగాణ-రామాయంపేట

గత కొంతకాలంగా రామాయంపేట కేంద్రంగా సాగుతున్న అక్రమ కలప రవాణాకు రామాయంపేట అటవీ శాఖ అధికారులు అడ్డుకట్ట వేశారు. గత నాలుగైదు నెలలుగా రామాయంపేట శివారు ప్రాంతమైన దామరచెరువు దగ్గర నీలగిరితో పాటు, ఇతర కలపను ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున డంపు చేసి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతంలో రెండు మూడుసార్లు అటవీశాఖ అధికారులు, దాడులు చేసి జరిమానాలు విధించినా, అవేమీ లెక్క చేయకుండా అక్రమ కలప రవాణా దర్జాగా కొనసాగిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం డిప్యూటీ అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో, దామరచెరువు ప్రాంతంలో డంపు చేసిన కలపను స్వాధీనపరచుకున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించడానికి లోడ్ చేసిన లారీని ఆధీనంలోకి తీసుకున్నారు. విచారణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని అటవి శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

నవతెలంగాణ-మెదక్

దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం మెదక్ పట్టణంలో టీఎన్జీవో భవనంలో బుధవారం మహిళా స్త్రీ శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ఏర్పాటు చేసిన దివ్యాంగుల కొరకు ఉచిత బ్యాటరీ ట్రైసైకిల్ ఎంపిక, కృత్రిమ అవయవాల కొలతల శిబిరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ముందుగా వైద్య శిబిరాన్ని సందర్శించి దివ్యాంగుల వైకల్యానికి అనుగుణంగా వివిధ పరికరాల పంపిణీకి ముందుకు వచ్చిన అలీమ్ కో స్వచ్ఛంద సంస్థ సేవలను కొనియాడారు. దివ్యాంగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని నేనున్నానంటూ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు అలిమ్ కో స్వచ్ఛంద సంస్థ దివ్యాంగుల వైకల్యాలను బట్టి వారికి వివిధ పరికరాలు అందించడం కొరకు ముందుకు రావడం జరిగిందన్నారు దివ్యాంగుల వైకల్యాలను ఆరోగ్య పరిస్థితిని, పరిశీలించి వారికి అనుకూలంగా పరికరాలు అందించేందుకు దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని వివరించారు. వినికిడి లోపం, ఆర్టిఫిషియల్ లింబ్స్, వీల్ చైర్స్ బ్యాటరీ సైకిల్స్ ఈ పరికరాల పంపిణీకి ప్రతిపాదన సిద్ధం చేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.


ఈ దివ్యాంగుల వైకల్యాల పరికరాలను అందజేసేందుకు రామాయణపేట, నర్సాపూర్‌లలో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మానసిక లోపం కలిగిన దివ్యాంగులను గుర్తించి దానికనుగుణంగా చికిత్స అందిస్తామన్నారు అవసరమైన దివ్యాంగులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిజియోథెరపీ నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు గతంలో దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటు చేయడంతో పాటు, వారి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దివ్యాంగులు సమాజంలో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. దివ్యాంగులు ఈ శిబిరాలను ఉపయోగించుకుని లబ్ది పొందాలన్నారు ఈ కార్యక్రమంలో సంబంధిత డీ డబ్ల్యు హైమావతి, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, ఆర్టిఫిషియల్



లింబ్ మన్ ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో) స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రసన్నకుమార్, రాజబాబు, సురేంద్ర, గుండె సంబంధిత వైద్యులు డాక్టర్ సురేందర్, ఇతర ప్రభుత్వ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లో ఈజీఎస్ సిబ్బంది

నవతెలంగాణ-టేక్మాల్



జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి గత మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందుల్లో పడుతున్నామని వాపోతున్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి విట్టల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీవో పౌలు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ భారం పడుతుందన్నారు. పిల్లలకు ఫీజులు కట్టలేక ఇల్లు గడవలేక బయట చెప్పుకోలేక అనేక బాధలు అనుభవిస్తున్నామన్నారు. గ్రామీణ పేదరికం నిర్మూలన కోసం కృషి చేస్తున్నామని, తమ బాధలు మాత్రం ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు ఇప్పటికైనా కల్పించుకొని తమ కుటుంబాలు రోడ్డున పడకుండా జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ పౌల్, సిఓలు సంగయ్య, సత్యనారాయణ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఖర్గే వ్యాఖ్యల పట్ల ఖండన

- మనోభావాలను దెబ్బతీయద్దు


నవతెలంగాణ-టేక్మాల్



కుంభమేళాలో గంగా నదిలో మునిగితే పేదరికం పోతుందా అని అన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి మండల అధ్యక్షులు నవీన్ గుప్తా మండిపడ్డారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మనోభావాలు దెబ్బతీస్తే, ప్రజలు తిరగబడి ప్రశ్నిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మల్లికా అశోక్ పాల్గొన్నారు.

యాదాద్రిని సందర్శించిన ఎమ్మెల్సీ శేరి దంపతులు


నవతెలంగాణ-మెదక్



ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి దంపతులు యాదాద్రి లక్ష్మీ నృసింహ స్వామిని బుధవారం దర్శించుకున్నారు. తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా సుభాష్ రెడ్డి లక్ష్మీ దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంటపంలో వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సమృద్ధిగా ఉండాలని స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. అందరు బాగుండాలని ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు

మహిళా డిగ్రీ కళాశాలలో నేడు జాబ్ మేళ


నవతెలంగాణ-మెదక్



మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 30న మహిళా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే హుస్సేన్ తెలిపారు. హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ సంస్థ సౌజన్యంతో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం మహిళ సాధికారత విభాగం సంయుక్తంగా ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పాసైన, ఫెయిల్ అయిన విద్యార్థినిలు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,152 వేతనంతో పాటు రూ. 1500 బోనస్, ఉచిత వసతి సౌకర్యం, భోజన వసతులు అందిస్తారని వివరించారు. ఎంపికైన వారికి రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళ అభ్యర్థులు జనవరి 30న ఉదయం కళాశాల ప్రాంగణంలో ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్కు హాజరుకావాలని కోరారు. పూర్తి సమాచారం కోసం జాబ్ మేళా సమన్వయకర్త చంద్రశేఖర్ (9849152712) సంప్రదించాలని కోరారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి రైతు మృతి

నవతెలంగాణ-దుబ్బాక/ మిరుదొడ్డి




ఫైల్

జాతరకు వచ్చి కూడవెల్లి వాగు వద్ద స్నానం చేసేందుకు నీటిలో దిగిన ఓ రైతు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్ పేట-భూంపల్లి మండలం రామేశ్వరం పరిధిలోని కూడవెల్లి వాగు వద్ద బుధవారం జరిగింది. భూంపల్లి ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాలు..దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన బిట్ల శివరాములు(50) వ్యవసాయం చేస్తూ అదే గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో వాచ్ మెన్‌గా పనిచేస్తున్నాడు. మాఘ అమావాస్య సందర్భంగా బుధవారం కూడవెల్లి జాతరకు వచ్చాడు. దర్శనానికి ముందు స్నానం చేద్దామని వాగు దగ్గరకు వెళ్తె ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లు గంగరాజు,హరీష్ లతో కలిసి ఏసీపీ మధు ఘటనస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాకలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య బాలవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య బలవ్వ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎస్సీలకే ప్రాధాన్యతనివ్వాలి

- ఎస్సి షెడ్యూల్డ్ కులాల ఆత్మీయ సమ్మేళనలో మాదిగల డిమాండ్



నవతెలంగాణ-కొల్చారం

రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో షెడ్యూల్డ్ కులాల వారికే ప్రాధాన్యత నివ్వాలని ఎస్సీ షెడ్యూల్డ్ కులాల నాయకులు పుర్ర ప్రభాకర్, గోషికే యోహాన్‌లు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన కొల్చారంలోని బాబా గార్డెన్ లో మాల, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళన సభ మాజీ ఎంపీటీసీ తుడుము రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పుర్ర ప్రభాకర్, మాజీ సర్పంచ్ గోదావరి, గోషకే యోహాన్‌లు మాట్లాడుతూ 75 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో కొల్చారం మండలంలో ఎస్సీలకు ఇంతవరకు ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు పొందలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రిజర్వేషన్లకు తూట్లు పొడిచే విధంగా కొందరు రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులకు ఎస్సీలు అర్హులు కారా అని ప్రశ్నించారు. కొందరు కావాలని అగ్రవర్ణ నాయకులు దళితులను రాజకీయంగా ముందుకు రానివ్వడం లేదని ఆరోపించారు. అదేవిధంగా ఎస్సీలకు అంబేద్కర్ అభయహస్తం ప్రతి ఇంటికి అందించే విధంగా చూడాలని, ఎస్సీ భూములకు సంపూర్ణ పట్టాలు కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చూసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెల్మకన్న ఎల్లేశం, మాజీ ఎంపీటీసీ ఆదాం, కోనాపూర్ మాజీ సర్పంచ్ కన్నారం రమేష్, కన్నారం దేవదాసు, నాయకులు బాబయ్య, ఎమ్మార్పీఎస్ కార్యదర్శిలు ఎర్రోళ్ల సంజీవయ్య, ఎమ్మార్పీ ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అరికెల ప్రవీణ్, టిఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, బంగారిగల్ల దుర్గయ్య పాల్గొన్నారు.



జపాన్ దేశ సైన్స్ సదస్సులో బీవీఆర్ఐటీ విద్యార్థులు

- విద్యార్థి బృందాన్ని అభినందించిన చైర్మన్ విష్ణు రాజు

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణ సమీపంలోని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటి మెకానికల్ , కెమికల్ ఇంజినీరింగ్ విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ స్పాన్సర్ చేసిన ప్రతిష్ఠిత సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ప్రోగ్రామ్ జనవరి 19 నుంచి 25 వరకు జపాన్‌లోని కుమమోటో యూనివర్సిటీలో నిర్వహించారు. కుమమోటో యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షుయిచీ టోరీ, సమక్షంలో బివిఆర్ఐటి కళాశాలకు చెందిన 7 మంది విద్యార్థులు, అధ్యాపకుడు కలిగిన బృందం వ్యర్థాలను శక్తిగా మార్పిడి చేసే సాంకేతి కతలపై పరిశోధన, శిక్షణలో పాల్గొన్నారు. వారు కుమ మోటో సిటీలో ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి శుద్ధి, ఘన వ్యర్థాలను ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్పిడి, వ్యర్థాలను విద్యుత్ ఉత్పత్తిగా మార్పిడి చేసే సౌకర్యాలను అధ్యయనం చేశారు. బృందం యూనివర్సిటీ ప్రొఫెసర్లు పరిశోధకులతో పరిశోధన నావీన్యత మార్పిడి సదస్సులో



పాల్గొన్న సందర్భంగా శ్రీ విష్ణు విద్యా సంస్థల చైర్మన్ విష్ణు రాజు జపాన్ దేశంలో సైన్స్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేసినందుకు, కుమమోటో యూనివర్సిటితో పరిశోధన సహకారాలను స్థాపించినందుకు అధ్యాపకులను విద్యార్థుల ను ఆయన అభినందించారు. ఇటువంటి పలు విదేశాలతో ఒప్పందాలు శిక్షణ పరిశోధనలను ప్రోత్స హిస్తామని చైర్మన్ విష్ణు రాజు అన్నారు. అదేవిధంగా వైస్-చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విస్సం, రీసెర్చ్ డీన్ డాక్టర్ రాజు ఏద్లా, డైరెక్టర్ ప్రొఫెసర్ లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సంజయ్ దూబే, డాక్టర్ రాధిక, డాక్టర్ వరుణ్‌లు విద్యార్థి బృందాన్ని అభినందించారు.

ప్రజలందరూ సంతోషంగా సుభిక్షంగా ఉండాలి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ-చేగుంట

దుబ్బాక నియోజకవర్గంలోని ప్రజలందరు సంతోషంగా సుభిక్షంగా ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డిలు అన్నారు. మాఘమామవాస్యను పురస్కరించుకొని చేగుంట మండలంలోని కర్నాల్ పల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవానికి బుధవారం హాజరైన వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మెన్ రాములు గౌడ్ ఆధ్వర్యంలో పూజారులతో కలిసి పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. అనంతరం కర్నాల్ పల్లి ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ చాలా మహిమాన్వితమైన రోజున నదులు, వాగులులో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, ఇష్టదైవాన్ని దర్శించుకొని ప్రార్థనలు చేస్తారని తెలిపారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ దేవికి



ముక్కుపుడక సమర్పించారు. కూడవేల్లి ప్రాంతంలో కూడా అనేక వేల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మల్లన్న సాగర్ ద్వారా నీటిని విడుదల చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మండల పార్టీ అధ్యక్షులు నారాయణరెడ్డి, మెదక్ జిల్లా సీనియర్ నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాములు గౌడ్, యువ నాయకులు డిష్ రాజు, రవి, అన్నం రవి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఆలయ కమిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గమైన ఆరోపణలు చేయాడం సరికాదు

- సునీత రెడ్డిని విమర్శిస్తే ఖబర్దార్
- చిల్లర రాజకీయాలు మాని అభివృద్ధికి సహకరించండి
- బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దుర్మార్గమైన ఆరోపణలు చేయడం సరికాదని , సునీత రెడ్డిని విమర్శిస్తే ఖబర్దార్ అని బిఆర్ఎస్ నాయకులు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్, మాజీ వైస్ ఎంపీపీ వెంకట నర్సింగ్ రావు ,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్‌లు అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని సునీత రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సునీత రెడ్డి పట్ల లేనిపోని ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నాయకులకు తగదన్నారు. అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ పార్టీకి సహకరిస్తామన్నారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, దాడికి ప్రతి దాడికి వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాయంలో నర్సాపూర్ ఎంతో అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ 13 నెలల కాలంలో ఉచిత బస్సు తప్ప మరేమి



చేసింది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేయిల్యూర్ అయిందన్నారు. చిల్లర రాజకీయాలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డికి విద్యావంతుడిగా పేరు ఉందని తెలుస్తుందన్నారు. కొందరు చిల్లర కాంగ్రెస్ నాయకుల మాటలు పట్టుకుని ఆవుల రాజిరెడ్డి చెడ్డ పేరు తెచ్చుకుంటున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీలో భూ అక్రమార్కులు ఉన్నారని కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం లో ఎటువంటి అర్థం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే భూ అక్రమార్కులు ఉన్నారని, అది రుజువు చేసేందుకు తాము సిద్ధమని, కాంగ్రెస్ నాయకులు సిద్ధమా అని ప్రశ్నించారు. ప్రస్తుత కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న ఆంజనేయులు గౌడ్ బ్రతుకు అప్పట్లో ఏమిటో అందరికీ తెలుసన్నారు. ఇకముందు సునీత రెడ్డిని వ్యక్తిగతంగా విమర్శిస్తే ఖబర్దార్ అని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భోగ చంద్రశేఖర్, రామ గౌడ్, జితేందర్ రెడ్డి, సేనాధిపతి, రవి, రాజేందర్ నాయక్, పంబల బిక్షపతి ,రామ్ చందర్, ఆంజనేయులు, జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల జోలికొస్తే ఊరుకోబోం..

- పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి

నవతెలంగాణ-శివ్వంపేట

అధికారం కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బీఆర్ఎస్ అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని, గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకుల జోలికొస్తే మాత్రం ఊరుకోబోమని పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి, మండల సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త అన్నారు. బుధవారం శివ్వంపేటలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నవీన్ గుప్త మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో ఉండే కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డిని గ్రామాలలో అడ్డుకుంటామని, దాడులు చేస్తామని మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రతి రోజు మండలంలో ఆవుల రాజిరెడ్డి పర్యటన ఉంటుందని బీఆర్ఎస్ నాయకులకు దమ్ముంటే అడ్డుకోవాలని ఆయన సవాల్ విసిరారు. వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి బిక్షతో ఎమ్మెల్యేగా గెలిచి ఆయనను పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రోటోకాల్ అంటూ జిల్లా గ్రంధాలయ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ పని ఖతం అయిపోయిందని అబద్దపు మాటలు చెపుతున్న సునీతారెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలలో మెజారిటీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీని గెలిపించుకోవాలని సవాల్ విసిరారు. దాడులు చేయడమంటే మీరేమన్నా వీధి రౌడీలా.. గోమారం వస్తాం ఏమి చేస్తారో చూద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనవసరపు విమర్శలు మాను కోవాలని లేదంటే కాంగ్రెస్ పార్టీ తడాఖా చూపిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ సోని రవి వారాల గణేష్,ఇసారపు రాజు గౌడ్, కములయ్యగారి వెంకటేష్, దానబోయిన కృష్ణ, ప్రభులింగం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, లస్కర్ ఆంజనేయులు,లు పాల్గొన్నారు.



మాఘ అమావాస్య పూజలు





నవతెలంగాణ-పాపన్నపేట

మౌని అమావాస్య జాతర సందర్భంగా మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఏడుపాయల జన సంద్రమైంది. మంజీరా నది ఉత్తర వాహిణిగా ప్రవహించే ఏడుపాయలలో పవిత్ర స్నానాలు చేసేందుకు తెల్లవారు జాము నుంచే ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల నుంచి, పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఘనపూర్ ఆనకట్ట గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో ఏడుపాయలలోని మంజీరా నది పాయలు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో ఘనపూర్ ఆనకట్ట దగ్గర, నదీపాయల వెంట ఏర్పాటు చేసిన షవర్ల దగ్గర భక్తులు స్నానాలు చేసి వన దుర్గా భవాని మాతను దర్శించుకుని అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. మౌని అమావాస్య జాతర సందర్భంగా వన దుర్గా భవానీ మాత ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో అమ్మవారి దర్శనానికి భక్తులు చాలా సేపు క్యూలైన్‌లలో వేచి ఉండాల్సి వస్తోంది. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు వేశారు. ఆలయ పరిసరాల్లోని నదీపాయల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి మొత్తం 3 జల స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశారు. మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో డీఎస్పీ ప్రసన్నకుమార్ 221 మంది సిబ్బంది. 4 క్యూ ఆర్మీ బృందాలతో బందోబస్తును పర్యవేక్షించారు. దేవాదాయ అధికారులు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

నవతెలంగాణ-కొల్చారం

మండల వ్యాప్తంగా పరమపవిత్రమైన మాఘ అమావాస్య పూజలు బుధవారం భక్తి ప్రత్తులతో సాగాయి. ఆలయాల్లో, ఏడుపాయల నదీతీర ప్రాంతాల్లో దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతక రీత్యా గ్రహ దోషాలు ఉన్నవారు శివుడికి పంచామృతాభిషేకాలు, శనీశ్వరుడికి తైలాభిషేకాలు, ఆంజనేయ స్వామికి సిందూర సమర్పణ పూజలు నిర్వహించారు. మాఘ మాసం చివరి రోజైన అమావాస్య రోజు నదీస్నానం ఆచరించడం అత్యంత శ్రేష్ఠమని పండితులు పేర్కొనడంతో భక్తులు నదీ తీర ప్రాంతాల్లో నదీ స్నానం ఆచరించి పునీతులయ్యారు. గ్రామాల్లో ఆంజనేయస్వామి, నవగ్రహ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు.

సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ప్రారంభం

- మెదక్ డీఈవో రాధాకిషన్

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ క్రీడా మైదానంలో ఒలింపియా ఇంటర్నేషనల్ స్కూల్, రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ అండర్ 14 బాల బాలికల క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం ఈ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ గంగాల సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ టోర్నమెంట్లో ఉమ్మడి పది జిల్లాలలోని హైదరాబాద్ మినహా మిగతా జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్, మేనేజర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఎంఈఓ పర్వతి సత్యనారాయణ, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి



శ్రీనివాసరావు, అథ్లెటిక్ అసోసియేషన్ మెదక్ జిల్లా కార్యదర్శి మధుసూదన్, క్రీడోత్సవాల పరిశీలకులు గంగమోహన్ రవికుమార్, సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ కోఆర్డినేటర్ శ్యాంసుందర్ శర్మ, వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, మాధవరెడ్డి, గోవర్ధన్, చంద్రమోహన్, మాలతి, లతిఫా ఉన్నిస, పద్మ, సరోజినీ, దేవేందర్ రెడ్డి, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ -వెల్దుర్తి

తపాలా సంస్థ వారి ఆధ్వర్యంలో డిజిటల్ వయసులో చేతిరాతను పోస్ట్ కార్డుపై వ్యాసరచన పోటీలను బుధవారం మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో చదివే 18 సంవత్సరాల లోపు 50 మంది విద్యార్థులకు జాతీయస్థాయిలో వ్యాసరచన పోటీలను నిర్వహించామని మెదక్ సౌత్ ఇన్స్పెక్టర్ సందీప్ కులకర్ణి తెలిపారు. విద్యార్థులు డిజిటల్ వైపే మొగ్గు చూపుతూ చేతిరాతను మరుస్తున్నారన్నారు. గతంలో ఉత్తరాల ద్వారా యోగక్షేమాలను తెలుసుకొని ఎంతో సంతోషించే వారన్నారు. ఉత్తరాలు రాయడం పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా పంపడం జరిగేదన్నారు. రాను రాను ఉత్తరాలు కనుమరుగై చేతిరాతలు కూడా రాయడం లేదన్నారు. ఈ డిజిటల్ యుగంలో చేతిరాతలు ఎలా రాయాలో కూడా తెలియని లోకం ఉందన్నారు. అందుకే డిజిటల్ వయసులో చేతిరాతపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ప్రథమ బహుమతి నలుగురికి రూ



50,000లు, రెండో బహుమతి నలుగురికి రూ 25000లు, మూడో బహుమతి నలుగురికి రూ 10000లు, అదే విధంగా హైదరాబాద్ పోస్టల్ సర్కిల్లో మొదటి స్థానంలో నిలిచిన నలుగురికి రూ 25000లు, రెండో స్థానంలో నిలిచిన నలుగురికి రూ 10 వేలు, మూడో స్థానంలో నిలిచిన నలుగురికి రూ 5000లు బహుమానం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ కృష్ణ, కస్తూర్బా పాఠశాల ఎస్ఓ ఫాతిమా పాల్గొన్నారు.

నేటి నుంచి బీరప్పస్వామి జాతర ప్రారంభం

నవతెలంగాణ-టేక్మాల్



గొల్ల కుర్మల ఆరాధ్య దైవమైన శ్రీ బీరప్పస్వామి దేవాలయం జాతర మహోత్స వాలకు ముస్తాబయింది. ఒగ్గుబీర్లవారితో అనేక రకాల విన్యాసాలతో నిర్వహించే ఉత్సవం వారం రోజుల పాటూ కొనసా గనుంది. జాతరకు సంబంధించి అన్ని రకాల వసతులతో పాటూ ఎర్పాట్లను నిర్వహకులు పూర్తి చేశారు. దేవాలయాన్ని రకరకాల రంగులతో, విద్యుత్ కాంతులతో ఎంతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 07వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ నెల 30న మంద పోచమ్మకు. 31 న మైలబోనం తీయుట, ఫిబ్రవరి 01న గంగకు వెళ్లుట, 02న బీరప్పస్వామికి బోనాల ఊరేగింపు, 03న బీరప్ప స్వామి కామరాతి కల్యాణం, 04న నాగవెల్లి వేశాలతో కథ చెప్పుట, 05న పాలు పొంగిచుట, సల్లలు చేయుట, 06న బొబుగొండకు బోనాల ఊరేగింపు. మధ్యాహ్నం గ్రామంలో గారడి విద్య. రాత్రి కథ చెప్పుట, 07న కడపలు కడుగుట బీర్లవారు వెళ్లిపోవుట వంటి కార్యక్రమాలు కొనసాగుతాయన్నా రు. జాతర ఉత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ, జహిరాబాద్ ఎంపీ సురేషెషెట్కా ర్లు హాజరు కానున్నారని నిర్వహకులు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు విద్యార్థులు తప్పకుండా హాజరు కావాలి

నవతెలంగాణ-నార్సింగి



ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు విద్యార్థులు విధిగా హాజరు కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఆర్. నరేందర్ గౌడ్ సూచించారు. ఇంటర్ పరీక్ష కొరకు ఫీజు కట్టిన ప్రతి విద్యార్థి ఈ పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 30 న "పర్యావరణ విద్య" ఉదయం 9 గం నుంచి మధ్యాహ్నం 1 గం వరకు, "ఇంగ్లీష్ ప్రాక్టికల్" జనవరి 31న ఉదయం 9 గం.నుంచి మధ్యాహ్నం 1 గం.వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు "ఇంగ్లిష్ ప్రాక్టికల్" పరీక్ష ఫిబ్రవరి 1న ఉదయం 9 గం నుంచి మధ్యాహ్నం 1 గం వరకు నిర్వహిస్తామని, పరీక్షలకు కావల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. విద్యార్థులు తప్పకుండా సమయానికి హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. నరేందర్ గౌడ్ పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
గురువారం | 30 జనవరి 2025 | www.navatelangana.com

పిల్లలకి ఎక్కువగా ఫైబర్ ఫుడ్ ఇవ్వాలి

- ప్రముఖ చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ సాయిరాం



నవతెలంగాణ-సిద్ధిపేట

పిల్లలకి ఎక్కువగా ఫైబర్ ఫుడ్ ఇవ్వాలని ప్రముఖ చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ సాయిరాం సూచించారు. స్థానిక సరస్వతీ శిశు మందిర్‌లో బుధవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. సుమారుగా 232 మంది విద్యార్థులను పరిశీలించి, అవసరమైన మందులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల్లో ఆహారపు అలవాట్లు చాలా ముఖ్యమైనవని, అందులో ఎక్కువ ఫైబర్ కంటెంట్ ఉండేలాగా ఆహారాన్ని తల్లిదండ్రులు పిల్లలకి ఇవ్వాలన్నారు. జలుబు, దగ్గు ఉన్నప్పుడు పిల్లలకి ఒకరి ద్వారా మిగతా వాళ్ళకి వేగంగా సంక్రమించే అవకాశం ఉందని, కాబట్టి ఆ సమయంలో పిల్లలు జాగ్రత్తగా ఉండాలని, చేతులను శుభ్రంగా కడుకోవాలని, ఉదయం, రాత్రి రెండుసార్లు కచ్చితంగా బ్రష్ చేయడము, రెండుసార్లు స్నానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ నాయక్, పాఠశాల ప్రధానాచార్యులు మోతుకు నరేష్ కుమార్, సాయి చరణ్, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-సిద్దిపేట



పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్యాల విజేందర్ రెడ్డి, సుంచు నరేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ట్రెజరి కార్యాలయంలో డీటీవోని కలిసి పెండింగులో ఉన్న మెడికల్, జీపీఎఫ్ లోన్స్, పార్ట్ ఫైనల్స్, ఫైనల్ పేమెంట్, సరెండర్, ఇతర బకాయిలు వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.లక్షలు పైబడిన బిల్లులు విడుదల చేయకపోవడం వలన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఆయా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం డైరీని డీటీవోకి అందజేశారు.

బెక్కల్‌లో పశువుల ఫర్టిలిటీ క్యాంప్


నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని బెక్కల్, గ్రామంలో బైరాన్ పల్లి, పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో పశువుల ఫర్టిలిటీ క్యాంప్ నిర్వహించినట్లు డాక్టర్ ఉషారాణి, తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని పశువులకు గర్భకోశ నిరోధక టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హరికృష్ణ, నితిన్ కుమార్ ,వి ఎల్ ఓ పరువయ్య, గోపాలమిత్ర సూపర్వైజర్ జైపాల్ రెడ్డి, గోపాలమిత్రలు ఆంజనేయులు, రవి,తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

- మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ దేవునూరి పోచయ్య.



నవతెలంగాణ-తొగుట

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ దేవునూరి పోచయ్య అన్నారు. బుధవారం మండలం లోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులతో కలిసి బాది తునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన నరేండ్ల భాగ్యలక్ష్మి కి రూ. 57,500 చెక్కును అందజేశామన్నారు. చెక్కు తీసుకున్న లబ్ధిదారులు శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కనికి స్వామి, ఐఎన్సివి సోషల్ మీడియా కన్వీనర్ బైతిప్రవీణ్, బైతి అరవింద్, నర్మెట ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాగ మానస దేవి వార్షికోత్సవం



నవతెలంగాణ-నంగునూరు

మండల కేంద్రంలో స్వయం భూ నాగమానస దేవి వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ప్రతియేటా అమావాస్య రోజు న ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవా యితీగా వస్తోంది. గ్రామ పురోహితులు ఆదిరాల సాయినాథ్ శర్మ అమ్మవారికి అభిషేకంతో పాటు పూజాలు నిర్వహించారు. ఆలయ పూజారి ఆనందచారి పాల్గొనగా భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు.

మురికి కాలువలో పడ్డ ఆటో..ఒకరికి స్వల్ప గాయాలు

నవతెలంగాణ-దుబ్బాక



అక్బర్ పేట భూంపల్లి మండలం చిట్టాపూర్ శివార్లలోని మెదక్ - సిద్దిపేట- ఎల్కతుర్తి జాతీయ రహ దారి పక్కన ఉన్న మురికి కాలువలో ప్రమాద వశాత్తు ఆటో పడటంతో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాలు.. సిద్దిపేటకు చెందిన సీహెచ్.చంద్రయ్య (45) తన ఆటోలో సిద్దిపేట నుంచి కూడవెల్లి జాతర కు వెళుతుండగా చిట్టాపూర్ శివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న మురికి కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయింది.స్వల్ప గాయాలైన బాధితున్ని భూంపల్లి 108 వాహనంలో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘట నపై ఎలాంటి ఫిర్యాదు అందలేదనిభూంపల్లి ఎస్ఐ హరీష్ తెలిపారు. కాగా జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మిస్తున్న మురికి కాలువలపై స్లాబ్ మూతలు ఏర్పాటు చేయకపోవడం పట్ల స్థానికులు,ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

- కమిషనర్ గోల్కొండ నరసయ్య



నవతెలంగాణ-గజ్వేల్

ఇంటి పన్ను, నల్ల బిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌కు సంబంధించి బిల్లులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య కోరారు. బుధవారం మున్సి పల్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక ఏడాదికి సంబంధించిన బిల్లులను వెంటనే ప్రజలు చెల్లించాలని కోరారు. ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి సహకరించి బిల్లులు చెల్లించాలని కోరారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధి కి ప్రజల సహకరించవలసిన అవసరం ఉందన్నారు.

పథకాలను అమలు చేసే దమ్ముందా..?

- సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వానికి బీజేపీ శ్రేణుల ప్రశ్న
- కేంద్ర మంత్రి బండిపై సీఎం వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ
- బీజేపీ అధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం..

నవతెలంగాణ-బెజ్జంకి



ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు, ప్రజాపా లనలో అమలు చేస్తామని హామీ నిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయి లో అమలు చేసే దమ్ముందో లేదో వెల్లడించాలని మండల బీజేపీ శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ కు రాష్ట్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటనపై మాట్లాడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం చౌరస్తా వద్ద బీజేపీ శ్రేణులు సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన మానుకుని ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు, ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై దృష్టి సారించి చిత్తశుద్ధితో అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి మహిపాల్ రెడ్డి సూచించారు. పార్టీలకతీతంగా అభివృద్ధికి పాటుపడుతున్న కేంద్ర మంత్రిపై కాంగ్రెస్ శ్రేణులు ఆరోపణలకు,విమర్శలకు స్వస్తి పలకాలని లేదేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు హెచ్చరించారు.బీజేపీ శ్రేణులు హాజరయ్యారు.

సమగ్ర శిక్షణతో బాలికలకు ఆత్మ రక్షణ

- ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఆత్మ రక్షణపై శిక్షణ





నవతెలంగాణ-నంగునూరు

పాఠశాలలు కళాశాలల్లో ఆత్మరక్షణ విద్య తప్పనిసరి చేయాలి. తద్వారా వారు తమపై ఏదైనా అనుకోని దాడి జరిగినప్పుడు ఎవరి సహాయం కోసం వెతకాల్సిన అవసరం ఉండదు. ఆత్మ రక్షణ విద్యను నేర్చుకున్న మహిళ స్వీయ రక్షణతో పాటు ఆపద సమయంలో ఇతరులను కాపాడుతుంది. యువతులకు జూడో, కరాటే, మార్షల్ ఆర్ట్స్, బేసిక్ డిఫెన్స్ టెక్నికల్ శిక్షణతో సహా స్వీయ-రక్షణ పద్ధతుల్లో అధికారిక శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆత్మరక్షణ వారిలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. విద్యావ్యవస్థలో బాలికల ఆత్మరక్షణ విద్యను తప్పని సరిగా చేర్చాలని నిర్ణయించారు. దీంట్లో భాగంగానే బాలికలకు స్వీయ రక్షణ శిక్షణను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ(డీఓఎస్ఈఎల్), సమగ్ర శిక్షా పథకాన్ని అమలు చేస్తోంది. దీని కింద సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఆరు నుండి 12 తరగతుల బాలికలకు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలతోపాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వర్గాలకు చెందిన ఆరు నుండి 12 తరగతి బాలికల కోసం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(కేజీబీవీల)లో స్వీయ రక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

సమగ్ర శిక్ష కింద బాలికలకు స్వీయ రక్షణ కోసం దేశంలో ప్రాథమికోన్నత పాఠశాలల సెకండరీ పాఠశాలకు 2019-20లో 1,80,160 ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.15,346.257 లక్షలు మంజూరి, 1,24,287 పాఠశాలల్లో శిక్షణ ఇచ్చారు. రూ.7,684.411లక్షలు ఖర్చు పెట్టారు. 81,800 సెకండరీ పాఠశాలకు రూ.6,656.358 లక్షలు కేటాయించగా, 42,241 పాఠశాలల్లో శిక్షణ, రూ.3,071.113లక్షలు ఖర్చు అయ్యాయి. 2020-21లో 1,47,784 ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.13,300.56 లక్షలు మంజూరు, 44,721పాఠశాలల్లో శిక్షణ, రూ.1,486.846 లక్షలు ఖర్చు చేశారు. 81,438 సెకండరీ పాఠశాలలకు రూ.7329.42లక్షలు కేటాయించగా 38,300 పాఠశాలల్లో అమలు జరిగి రూ.2120.902లక్షలు ఖర్చు అయ్యాయి. 2021-22 లో, కోవిడ్-19 మహమ్మారి కారణంగా నిధులు ఒక నెలకు మాత్రమే మంజూరయ్యాయి. 1,63,045 ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.8,320.49 లక్షలు కేటాయించగా 36,381 పాఠశాలల్లో విద్యార్థినులు శిక్షణ పొందారు. ఇందుకు రూ.1,125.521లక్షలు ఖర్చు చేశారు. 56,869 సెకండరీ పాఠశాల లకు రూ.3,337.27లక్షలు కేటాయించారు. కేవలం 8,457 పాఠశాలల్లో అమలు జరిగి రూ.350.338 లక్షలు ఖర్చు చేశారు. 2022-23లో 1,88,005 ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలు కావడంతో రూ.23,106.85లక్షలు ఖర్చు అయ్యాయి. 83,031 సెకండరీ పాఠశాలల్లో రూ.9,082.63లక్షలు ఖర్చు చేశారు. శిక్షణకు ఎంపికైన ప్రతి పాఠశాలలో వారానికి మూడు సెషన్‌ల చొప్పున నెలకు 12 సెషన్‌లలో శిక్షణ ఇస్తారు. ఒక సెషన్ సుమారు 50 నిమిషాలు ఉంటుంది. ఇలా మూడు నెలల కాలంలో మొత్తం 36 సెషన్ లలో విద్యార్థినులకు ఆత్మ రక్షణ శిక్షణ ఇస్తారు. దీనిలో ఆపద సమయంలో ఎలా స్పందించి తమను తాము రక్షించుకోవాలని మెళకువలు నేర్పిస్తారు. సమగ్ర శిక్షా పథకం గడువు ముగియడంతో 2025-26 వరకు పొడిగించారు. స్వీయ రక్షణ శిక్షణ పేరును 'రాణి లక్ష్మీ బాయి ఆత్మ రక్షా శిక్షణ'గా మార్చారు. 2024-25 లో సిద్దిపేట జిల్లాలోని 258 పాఠశాలలను రాణి లక్ష్మీ బాయి ఆత్మ రక్షా శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేశారు. వీటిలో 203 ఉన్నత, 13 ప్రాథమికోన్నత, 16 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, నాలుగు తెలంగాణ ఆదర్శ పాఠశాలలు, 22 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ఉన్నాయి. ఇందుకోసం సమగ్ర శిక్షా పథకం కింద రూ.38.7లక్షలు మంజూరు చేశారు. శిక్షకులను ఎంపిక చేసి 2024 నవంబర్ మూడోవారంలో శిక్షణను ప్రారంభించారు. ఈ శిక్షణ వచ్చే నెలాఖరు వరకు సాగుతుంది. నంగునూరు మండలంలోని నర్మెటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బి. అనిత బాలికలకు ఆత్మ రక్షణపై శిక్షణ ఇస్తున్నారు. నంగునూరు, రాజగోపాల్ పేట, పాలమాకుల, బద్దిపడగ, నర్మెట, గట్లమల్యాల, ముగ్దుంపూర్, అంక్షాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కరాటే శిక్షకుడు సొప్పరి ఎల్లదాస్ బాలికలకు ఆత్మ రక్షణ విద్యలో మెళకువలు నేర్పిస్తున్నారు.

బాలికల్లో ఆత్మ స్థైర్యం పెరుగుతుంది


ఎల్లదాస్, కరాటే శిక్షకుడు



ఆత్మ రక్షణ శిక్షణ ద్వారా బాలికల్లో ఆత్మ స్థైర్యం పెరుగుతుంది. ఈ శిక్షణ వల్ల వారిలో బెరుకు తనం తొలగి పోయి, ఒంటరిగా ఉన్నప్పుడు, ఆపద సమయంలో ఏదైనా ప్రమాదం ఎదురైనపుడు ఎలా స్పందించాలో మెళకువలను నేర్పిస్తున్నాం. దీనివల్ల తమను తాము రక్షించుకోవడంతో పాటు సాటి బాలికలకు రక్షణగా నిలుస్తామనే ధైర్యం వారిలో పెరుగుతుంది.

జిల్లాలో 25 వేల మంది బాలికలకు శిక్షణ

ఎల్లంకి శ్రీనివాస రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి,



జిల్లాలోని258 పాఠశాలల్లో సమగ్ర శిక్ష ద్వారా బాలికలకు ఆత్మ రక్షణ విద్య అమలు అవుతోంది. వీటిలో మొత్తం 25,148 మంది బాలికలు ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆత్మ రక్షణ శిక్షణ పొందుతున్నారు.

భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్ సంభందించిన డిస్ట్రిబ్యూషన్ కెనాల్ భూసేకరణ ప్రక్రియ గూర్చి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రిజర్వాయర్ కెనాల్ గురించి పూర్తి వివరాలను కలెక్టర్ కి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని పంపిణీ ప్రక్రియకు సంబంధించిన మెజర్ కెనాల్ పనులు దాదాపు పూర్తయిన మైనర్, సబ్ మైనర్ కెనాళ్ల భూసేకరణ ప్రక్రియ పూర్తి అయితే జిల్లాలో ఆయకట్టు గణనీయంగా పెరిగే ఆస్కారం ఉందని తెలిపారు. భూసేకరణ అనేది ఆయా గ్రామాల్లో ఒక్కో కారణం చేత అడ్డంకులు ఎదురవుతున్నందున్న అన్ని విషయాలను నోట్ చేసుకుని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు ఫీల్డులో ఒక ప్రక్కా ప్రణాళికతో వెళ్లాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కెనాన్ నిర్మించేందుకు కావలసిన భూసేకరణ వివిధ మండలాల వారీగా మండల రెవెన్యూ, ఇరిగేషన్ ఒక టీంగా ఏర్పడి ఆయా గ్రామాల్లో కాలువల భూసేకరణ వేగవంతంగా జరపాలి. కాలువల వల్ల జరిగే ప్రయోజనాలను వివరిస్తూ భూసేకరణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ల్యాండ్ ఆక్యువెషన్) గీత, ఆర్డిఓ సదానందం, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్తును అందించడానికి చర్యలు

- జిల్లా నోడల్ అధికారి, డైరెక్టర్ కమర్షియల్ సాయిబాబా



నవతెలంగాణ-సిద్ధిపేట

జిల్లా లోని రైతులకు, ప్రజలకు, పరిశ్రమల వారికి వేసవిలో నాణ్యమైన విద్యుత్తును అందించడానికి ఇప్పటి నుంచే చర్యలను తీసుకుంటున్నట్లు జిల్లా నోడల్ అధికారి, డైరెక్టర్ కమర్షియల్ సాయిబాబా తెలిపారు. బుధవారం విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క వేసవిలో నాణ్యమైన విద్యుత్తు అందించడానికి ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. అందులో భాగంగా బుధవారం జిల్లాలో అనంతసాగర్, సిద్దిపేట లోని కేసీఆర్ నగర్ సబ్ స్టేషన్‌లను, లైన్ లను పరిశీలించినట్లు తెలిపారు. ఎస్ఈ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఎస్ ఈ, ఏడిఈ, డీఈలతో వేసవి కాల అవసరాల కోసం, జిల్లాలో జరుగుతున్న సబ్ స్టేషన్ల నిర్మాణాలు, సబ్ స్టేషన్ ల ఉన్నతీకరణ, గత ఏడాదిలో ఈ సమయంలో ఎంత విద్యుత్తు వాడకం జరిగింది తదితర అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. సిద్దిపేట సబ్ స్టేషన్‌లో 31.5 ఎంవీఏపీటీఆర్ ఉండగా 50 ఎంవిఏ పీటీఆర్ గా మార్చడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ అవసరాలపై హైదరాబాద్ పట్టణంలో ఫిర్యాదులు చేయడానికి 1912కు ఫోన్ చేసి సమాచారం ఇస్తున్నారని, త్వరలోనే ఈ నంబర్‌తో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుండి సూచనలు, ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. సిద్దిపేట, కరకపట్ల లో 33/11 కె.వి సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తి జరిగిందని, చిట్టాపూర్ లో నిర్మాణం జరుగుతుందని త్వరలోనే దాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతే వెంటనే అందించడానికి వివిధ కెపాసిటీలలో 1326 ట్రాన్స్ఫార్మర్ లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గృహ అవసరాలకు విద్యుత్తును వినియోగించుకుంటున్న వారిలో జిల్లావ్యాప్తంగా రూ.4 కోట్లు బకాయిలు ఉన్నాయని, బకాయిలను వెంటనే చెల్లిస్తే మరింత నాణ్యమైన విద్యుత్తును అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చంద్రమోహన్, వివిధ విభాగాల ఏడిఈ, డిఇలు శ్రీనాథ్, ముత్తయ్య, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలుంటే పుష్కలంగా ఉద్యోగ అవకాశాలు

నవతెలంగాణ-గజ్వేల్



నేటి సమాజంలో నైపుణ్యాలు కలిగిన విద్యార్థిని విద్యార్థులకు పుష్కలమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఇండియన్ ఫారెన్ ఫార్ బెటర్ సొసైటీ ఎన్జీవో ఆర్గనైజేషన్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి యువత కొన్ని రకాలైన నైపుణ్యాలను అలవర్చుకుంటే మంచి ఉద్యోగాన్ని పొంది ఉత్తమమైన జీవితాన్ని అనుభవించొచ్చు అన్నారు. నేటి ప్రపంచం ఈ మధ్యకాలంలో ఏ.ఐ టెక్నాలజీ మీద ఆధారపడిందన్నారు. ఆ టెక్నాలజీలో ప్రావీణ్యం సంపాదించుకుంటే ప్రపంచ వ్యాప్తంగా విస్తారమైన ఉద్యోగ అవకాశాలను పొందే అవకా శం ఉందన్నారు. ఏ నైపుణ్యాలను సంపాదించుకోలేని విద్యార్థులు ఏ చిన్నపాటి ఉద్యోగ, ఉపాధి అవకాశాన్ని కూడా పొందలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ తదితర రంగాలలో ఉద్యోగాలు సంపాదించడానికి అవసరమైన శిక్షణను మా సంస్థ తరపున ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. నిక్కత్ అంజుమ్, వైస్ ప్రిన్సిపల్ ఎస్. గణపతి రావు, టీ.ఎస్ .కే. సి కోఆర్డినేటర్ డా. టి. కవిత, టి ఎస్ కె.సి మెంటర్ జబ్బర్, కెరియర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ విజయ భాస్కర్ రెడ్డి, గణపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇండ్లు ఇవ్వడంలో బీఆర్ఎస్ విఫలం

- అర్హులకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు
- కాంగ్రెస్ నాయకురాలు ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

కేసీఆర్ ఇలాఖాలో డబుల్ బెడ్రూంల కేటాయింపులో అర్హులకు మొండిచేయి చూపించి పదేళ్ల పరిపాలించారని కాంగ్రెస్ నాయకురాలు ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో అర్హులకు ఇండ్లు ఇవ్వడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పారదర్శకంగా అర్హులకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలకు దిగడం దారుణంగా ఉందన్నారు. ప్రజల సమక్షంలోనే లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేయడం అసలైన లబ్దిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రూ.12 వేల ఆర్థిక సహాయం, ఇళ్ళు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల, రైతులకు రైతు భరోసా, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ప్రజలు రాజకీయంగా బొందపెట్టే రోజు కోసం ఎదురు చూస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

పారదర్శకంగా అర్హులను గుర్తించాలి

- ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్ : దరఖాస్తుల మీద దరఖాస్తులు ఇస్తూ పథకాలంటేనే పేద ప్రజలు విసుగు చెందుతూన్నారని ఇప్పటికైనా అర్హులను పారదర్శకంగా గుర్తించాలని ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ మండల అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచం అంతా ఆన్లైన్లో ఉంటే మనం మాత్రం దరఖాస్తులు ఇచ్చుడు కాన్నే ఉంటు న్నామన్నారు.ఏ పార్టీ ఐన సరే ఏ నాయకుడైనా సరే ఈ సారైనా ఖచ్చితంగా అర్హులను గుర్తించి వారికి ఇల్లు, రేషన్ కార్డు ఇవ్వలని, లింకులు పెట్ట కుండా భూమి లేని వారికి ఆత్మీయ భరోసా ఇవ్వలన్నారు. అధికారులు ఇప్పటికైనా గ్రామాలలో అర్హులను పారదర్శకంగా గుర్తించి పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో శిక్షణ



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్సు, రిలయన్స్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ పైన ఏడు రోజుల పాటు తేది జనవరి 28 నుంచి ఫిబవరి 4వ పాటు శిక్షణా కార్యక్రమము ఫైనల్ ఇయర్ విద్యార్థులకు నిర్వహిస్తామని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం తెలిపారు. ఈ శిక్షణలో కమ్యూనికేషన్స్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, స్ట్రెస్ మేనేజ్మెంట్, టీం వర్క్ మాక్ ఇంటర్వ్యూస్ మొదలగునవి షెడ్యూల్లో ఉంటాయని, మ్యాజిక్ బస్ ట్రైనర్ రోహిణి తెలిపారు. 70 మంది విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కమల క్రిస్టియాన, ఐ.క్యూ.ఏ.సి.కో ఆర్డినేటర్ ఎంఎం.లక్ష్మి, డాక్టర్ బాలచంద్రం, డాక్టర్ మురళీధర్, డాక్టర్ జయరాజు ,కంప్యూటర్ ఫ్యాకల్టీ అన్వర్, స్వర్ణ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎస్‌వి.శ్రీకాంత్


నవతెలంగాణ-సిద్ధిపేట



ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా సిద్దిపేట జిల్లాకు చెందిన ఎస్వీ. శ్రీకాంత్ మంగళవారం ఖమ్మంలో జరిగిన సంస్థ ఐక్యత సభలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2023 నిజామాబాద్‌లో జరిగిన సంస్థ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శ్రీకాంత్, నిన్నటి ఖమ్మం సభలో రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేసిన వారిలో శ్రీకాంత్ మొదటివాడు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రెండోసారి ప్రధానమైన బాధ్యతలు అప్పగించిన పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. పీడీఎస్ యూ నిర్మాత జార్జిరెడ్డి స్ఫూర్తితో భవిష్యత్తులో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల పక్షాన బలమైన గొంతు వినిపిస్తామని తెలిపారు. ఎస్.వి.శ్రీ కాంత్ కు ప్రజా సంఘాలు ప్రెస్ క్లబ్ లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోడీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు ఆస లక్ష్మణ్, సామాజిక వేత్త శ్రీహరి యాదవ్, డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్, సతీష్ లు ఉన్నారు.

కొండపోచమ్మ జలాశయం వద్ద పోలీస్ అవుట్ పోస్ట్.!

నవతెలంగాణ-గజ్వేల్



కొండపోచమ్మ జలాశయాల వద్ద పోలీస్ అవుట్ పోస్ట్, నామ మాత్రంగా ఉన్న సీసీ కెమెరా వ్యవస్థ పునరుద్ధరణ, సూచిక బోర్డులు ఏర్పాటు అంశాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలుస్తుంది. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన తొలి రోజుల్లోనే రక్షణ చర్యలు బాగానే ఉన్నప్పటికీ ప్రస్తుతం అవి లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు అధికారులు గుర్తించారు. ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలపై దృష్టి పెట్టినట్టు తెలుస్తుంది. నిఘా విభాగం ఇక్కడ పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల కూడా ప్రమాదాలకు దారితీస్తుంది. మొదట్లో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. అక్కడక్కడ పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేశారు. క్రమముగా వారిని తొలగిస్తూ వచ్చింది. పర్యటకులకు ప్రమాదా స్థలాలను వివరించేవారు. తిరిగి మళ్లీ ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టు చుట్టూ పైకి ఎక్కే స్థలంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి సూచిక బోర్డులను కూడా అక్కడక్కడ ఏర్పాటు చేయాలి. దీంతో ప్రమాదాల నివారణ చేపట్టవచ్చు. కొండపోచమ్మ సాగర్లో ఎత్తును గుర్తించడంలో సందర్శకులు అయోమయానికి గురవుతున్నారు. దీనిపై రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎస్ఎఫ్ఐ మండల మహాసభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-కొమురవెల్లి



ఎస్ఎఫ్ఐ మండల మహాసభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం రంజిత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ మండల మహాసభను ఫిబ్రవరి 1, 2 తేదీల్లో కొమురవెల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్నమని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు మహాసభలు దోహదం చేస్తాయన్నారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా మండల మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు, మైసంపల్లి రాహుల్, తాడూరి భరత్ కుమార్, నాయకులు లెనిన్ రాజు, భరత్ తదితరుల పాల్గొన్నారు.

మండల పరిషత్ కోసం కుదరని ఏకాభిప్రాయం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండల కేంద్రంలో ప్రభుత్వం మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు కోసం ప్రభుత్వ భవనాలను పరిశీలించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు గ్రామంలోని మూడు నాలుగు ప్రభుత్వ భవనాలతో పాటు గ్రామపంచాయతీ భవనాన్ని మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. ఈ క్రమంలో గ్రామస్తుల అభిప్రాయం కొరకు బుధవారం స్పెషల్ ఆఫీసర్ మధుసూదన్, అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామస్తుల అభిప్రాయం సేకరించారు. మండల పరిషత్ కార్యాలయం గ్రామపంచాయతీ కార్యాలయంలో అని కొందరు,రైతు వేదికలో పెట్టాలని కొందరు, ప్రయివేటు బిల్డింగులో పెట్టాలని మరికొందరు చెప్పడంతో ఏకాభిప్రాయం రాకపోవడంతో మండల పరిషత్ కార్యాలయం ఎక్కడ పెట్టాలో నిర్ణయం తీసుకోవాలని గ్రామస్తులకు స్పెషల్ ఆఫీసర్ మధుసూదన్, రెండు రోజుల గడువు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, పంచాయతి కార్యదర్శి సిద్దేశ్వర్, మాజీ జెడ్పీటీసీ నాచగోని పద్మ వెంకట్ గౌడ్, మాజీ సర్పంచులు దూబ్బుడు దీపిక వేణుగోపాల్ రెడ్డి, నాచొని పద్మ లక్ష్మణ్ గౌడ్, సుద్దాల రేణుక నర్సింలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కుకునూర్‌పల్లి తహసీల్దార్‌గా సుజాత

నవతెలంగాణ-కొండపాక



కుకునూర్ పల్లి నూతన తహసీల్దార్‌గా సుజాత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఎస్. మల్లికార్జున్ రెడ్డి అక్బర్ పేట్-భూంపల్లి మండలంకు బదిలీపై వెళ్లగా గజ్వేల్ ఆర్డీవో ఆఫీస్ లో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వస్తున్న సుజత బదిలీ పై కుకు నూర్ పల్లి మండల తహసీల్దార్ గా బదిలీ పై వచ్చారు

టైరు పగిలి చెట్టుకు ఢీకొన్న కారు



-పలువురికి స్వల్ప గాయాలు

నవతెలంగాణ-దుబ్బాక

కూడవెల్లి జాతరకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తున్న క్రమంలో టైరు పగిలి కారు పల్టీలు కొట్టడంతో చెట్టుకు ఢీకొని ఆగగా..అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలైన ఘటన సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని మెదక్ -సిద్ధిపేట- ఎల్కతుర్తి జాతీయ రహదారి పై ధర్మాజీపేట కమాన్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగింది.108 సిబ్బంది ఎల్లప్ప,స్థానికులు తెలిపిన వివరాలు..సిద్ధిపేటకు చెందిన చిప్ప పుష్పలత(67), కుమారుడు శ్రీకాంత్, కోడలు దివ్య, ఇద్దరు చిన్నారులతో కలిసి కూడవెల్లి జాతరకు వచ్చారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ధర్మాజీపేట కమాన్ వద్ద ప్రమాదవశాత్తు కారు టైరు పగిలి ఫల్టీలు కొట్టి చెట్టుకు ఢీకొనడంతో ముగ్గురికి స్వల్ప గాయాలైనాయి. బాధితుల్ని దుబ్బాక 108 అంబులెన్స్ ద్వారా సిద్ధిపేటలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వీ.గంగరాజు తెలిపారు.

చేబర్తి పెద్ద చెరువు వద్ద ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మర్కూక్



మండల పరిధిలోని కూడవెల్లి వాగు జన్మస్థానం చేబర్తి పెద్ద చెరువు వద్ద గ్రామస్థులు బుధవారం పువ్వులు చల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ కూడవెల్లి వాగు జాతర ప్రారంభమైన సందర్భంగా పెద్ద చెరువు వద్ద గ్రామస్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కట్ట మైసమ్మ తల్లికి, ఎల్లమ్మ తల్లికి, హనుమాన్ స్వామికి కొబ్బరికాయలు కొట్టి విశేష పూజలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఉప సర్పంచ్ స్వామి, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి మాట్లాడుతూ చేబర్తి పెద్ద చెరువును పర్యాటక ప్రాంతంగా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దాదాపు 108 ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్ద చెరువు ద్వారా దాదాపు 300 ఎకరాల ఆయకట్టు ఉందని, ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకొని అభివృద్ధి చేయాలన్నారు. తెలంగాణలోనే సుమారు 600 మీటర్ల ఎత్తులో ఉన్న చేబర్తి చెరువు జన్మస్థానం కూడవెల్లి వాగు కాలువల ద్వారా 100 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుందని తెలిపారు. దీనిని గుర్తించిన మాజీ సీఎం కేసీఆర్ కొండ పోచమ్మ ప్రాజెక్టును నిర్మించారని గుర్తు చేశారు. చేబర్తి నుంచి గంగాపూర్ వరకు చెరువు కట్టపై బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్వేరో సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు చిన్ని కృష్ణ,యువ నాయకులు పోయిల బాలస్వామి, సారధి ఫౌండేషన్ చైర్మెన్ గుడాల శేఖర్ గుప్త, నాయకులు జయరాం, నర్సింలు, గంధమల్ల తిరుపతి, గుడాల నరేష్, సత్యం, గాలేష్, మహేష్, గ్రామస్థులు తదితరులున్నారు.

పెద్దపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదం

-సిద్దిపేట వాసులు ఇద్దరు మృతి

నవతెలంగాణ-సిద్దిపేట



ఫైల్

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకాగా, సిద్దిపేటలోని శ్రీ నగర్ కాలనీ కి చెందిన తార కనకయ్య లు భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం ఉదయం సిద్దిపేట నుంచి కాళేశ్వరానికి పుణ్య స్నానాల కోసం కారులో వెళ్తుండగా, సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి శివారు వద్ద గల రాజీవ్ రహదారిపై కారు అదుపుతప్పి కల్వర్టును వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో పట్టణానికి చెందిన దంపతులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు కరీంనగర్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని బంధువులకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆసుపత్రిలో తర్వాత హైదరాబాద్‌కు మెరుగైన వైద్య చికిత్స కోసం పంపించినట్లు తెలిపారు. తార కనకయ్యల మృతదేహాలను బంధువులు సిద్దిపేటకు తెప్పించి, దహన సంస్కారాలు జరిపించారు. సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించి, వారి బంధువులకు సానుభూతిని తెలిపారు.

ఎద్దుల బండిపై దుబ్బాక ఎమ్మెల్యే


నవతెలంగాణ-తొగుట



వెంకటేశ్వర స్వామి దయతో ప్రజలంతా పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని వెంకట్రావపేటలో జరిగిన వెంకటేశ్వర స్వామి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మాఘఅమావాస్య సందర్భంగా ఏటా ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, వెంకటేశ్వర స్వామి జాతర కోసం వేలాది మంది భక్తులు తరలిరావడం సంతోషకరం అన్నారు. ఈ సందర్భంగా ఎడ్ల బండ్ల ప్రదర్శనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం చౌడాలమ్మ, ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ అశోక్, కార్యదర్శి రవీందర్, మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు దోమల కొమురయ్య, బక్క కనకయ్య, రైతు బంధు మాజీ అధ్యక్షులు బోధనం కనకయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సిలివేరి మల్లారెడ్డి, నాయకులు కంది రాంరెడ్డి, డబ్బికారి పెంటోజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని ముర్షిద్ గడ్డలోని దర్గా ఆశ్రమంలో గంధం ఊరేగింపుతో ఉర్సు ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా కవ్వాలి, గంధం ఊరేగింపు జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పీఠాధిపతి ఖాజా మహమ్మద్ హకీమ్ షరీఫ్ చిష్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పెద్దలు హఫెజ్ ఖైరాబాద్ పీఠాధిపతి సయ్యద్ ఫర్కాన్ హష్మి, సయ్యద్ పల్లి పీఠాధిపతి సయ్యద్ ముక్తార్ హుస్సేని, ఖాజా మహమ్మద్ సాబేర్ షరీఫ్, ప్రభు, నాయుబ్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై పట్టుదలతో ఉన్న కౌన్సిలర్

-ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్




గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 11 వార్డులో అభివృద్ధిపై పట్టు గల కౌన్సిలర్‌గా పని చేసినట్లు ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం వార్డులో ప్రజల మధ్యన ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రతాపరెడ్డి హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు వార్డులో కౌన్సిలర్ గంగిశెట్టి చందన రవీందర్ కు ఎప్పటికీ గుర్తుంటాయని అన్నారు. కౌన్సిలర్ నిరంతరంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించినట్లు అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల దీవెనతో ఎన్నికల రంగంలో ఉండాలని కోరారు. వార్డులో తనను గెలిపించి మున్సిపల్ కు పంపిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు అని కౌన్సిలర్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజా సేవకు అంకితం అవుతమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మైనార్టీ నాయకులు జాఫర్ ఖాన్, వార్డు నాయకులు నరేష్, ప్రభాకర్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి ప్రోత్సహం ఢిల్లీ దాక నడిపించింది

- జాతీయ యూత్ పెస్ట్‌లో దౌల్తాబాద్ మండల యువకుడు
- ప్రధాని, కేంద్ర మంత్రులతో ముఖాముఖి
- తెలంగాణ రాష్ట్రం తరపున వికసిత్ భారత్‌కి ఎంపిక
- గాజుల పల్లి యువకుడి ఘనత
- మండల యువకునికి అభినందనల వెల్లువ

తన బాల్యంలోనే తండ్రి మరణించిన అనంతరం తన తల్లి బీజన్ బీ సహకారంతో, మేనమామ చాంద్ పాషా ప్రోత్సహంతో తన విద్యాభ్యాసం పూర్తి చేసాడు. ఒక్కో మెట్టు ఎదుగుతూ గాజుల పల్లి నుంచి దేశ రాజధాని ఢిల్లీ దాక అలుపెరుగని ప్రయాణం చేసాడు. తెలంగాణ రాష్టానికి ప్రాతినిధ్యం వహించి దేశ ప్రధాని, కేంద్ర మంత్రులతో సమావేశం అయ్యే అవకాశం పొందాడు. అంతటి ఘనత సాధించిన దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన యువకుడు షాదుల్ గురించి ప్రత్యేక కథనం.


నవతెలంగాణ-దౌల్తాబాద్




షాదుల్ విద్యాభ్యాసం ఒకటవ తరగతి నుంచి ఐదో తరగతి వరకు గ్రామం గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్నత పాఠశాల దొమ్మటలో పూర్తి చేసాడు. అనంతరం యస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల సిద్ధిపేటలో ఇంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్దిపేటలో బీఎస్సీ, సర్ధార్ పటేల్ కళాశాల సికింద్రాబాద్‌లో ఎంఎస్సీఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసాడు. గాజులపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ రెడ్డి షాదుల్ విద్యకు, తన హాస్టల్, తన కోచింగ్, తన ఉన్నత చదువులకు, చిన్ననాటి నుంచి జాతీయ స్థాయి దాక వెళ్ళడానికి ఆర్థిక సహకారం అందించాడు.

షాదుల్ ప్రస్థానం

-2014 లో నేషనల్ యూత్ డే స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మిరుదొడ్డి మండలంలో నిర్వహించిన ఉపన్యాస పోటీలో మొదటి బహుమతి పొందాడు. 2015లో, 2018 లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి యువతరంగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. 2016 లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లహరి మ్యాగ్జిన్ లో "యువత మేలుకో" అనే ఆర్టికల్ రాసి, యువకులకు ఆదర్శనంగా నిలిచాడు. 2017 లో నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికై అప్పటి గవర్నర్ నర్సింహన్ ముందు ఉపన్యాసం ఇచ్చాడు. 2018 లో రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీలో గెలుపొంది, నగదు పురస్కారం అందుకున్నాడు. 2019 లో అజిమ్ ప్రేమ్ జి యూనివర్సిటీలో ఎంపె డెవలప్మెంట్ లో సీటు సంపాదించించాడు. షాదుల్ పదవ తరగతిలో తన గురువు, కవి నార్లపురం రాములు నుంచి "మొలదారం లేని మొగోడు" అనే బిరుదు పొందాడు. 2024 నవంబర్ నెలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ - 2025 కార్యక్రమం ప్రవేశపెట్టారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని మన భారత దేశంలో వికసిత్ భారత్ కార్యక్రమం మొదటి స్థాయి క్విజ్ పోటీలో "యువత సాధికారత" అనే అంశంలో తెలంగాణ రాష్టం తరుపున మహమ్మద్ షాదుల్ ఎంపికై తెలంగాణ రాష్టానికి ప్రాతినిధ్యం వహించాడు.నేషనల్ యూత్ ఫెస్టివల్ 2025 న్యూ ఢిల్లీలో గ్రామీణ పేద, మధ్యతరగతి బడి బయట ఉన్న పిల్లలకి బడిలో భావితరాల భవిష్యత్తు, తన అన్వేషణ మార్గాన్ని ప్రధాని మోడీ, కేంద్ర యువజన సర్వీసులు,స్పోర్ట్స్ మంత్రి మనసుఖ్ మండవీయా ముందు తన అన్వేషణ మార్గాన్ని తెలిపాడు. మారుమూల గ్రామం గాజులపల్లి నుంచి ఢిల్లీ వరకు వెళ్ళి ఆధునిక భారతదేశ అభివృద్ధిలో తన ఆలోచన వ్యక్తపరిచినందుకు వారి గ్రామ ప్రజలు మహమ్మద్ షాదుల్ కు సన్మానం చేసి హర్షం వ్యక్తం చేశారు.





చాల సంతోషంగా ఉంది




నేషనల్ యూత్ ఫెస్టివల్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ , ఇస్రో చైర్మన్ డా.వి. నారాయానాన్, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, కేంద్ర మంత్రి మనసుఖ్ మండవ్య, కిషన్ రెడ్డి లతో సమావేశాల్లో పాల్గొనడం మరువలేని అనుభూతి నింపింది. వారి సందేశాలు నన్ను చాలా ఉత్తేజపరిచాయి. భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడి మా అమ్మ, మామ కష్టానికి ప్రతిఫలం అందిస్తాను.

-మహమ్మద్ షాదుల్

బీటీ రోడ్ల మరమ్మత్తులకు నిధులు మంజూరు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్ధిపేట



నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పలు బీటీ రోడ్ల మరమ్మత్తులకు రూ.5 కోట్ల 13లక్షల నిధులు మంజూరు అయినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇటీవల పలు రోడ్లు పాడయ్ పోయి ప్రజల ప్రయాణానికి ఇబ్బందిగా మారిందన్నారు. చిన్న కోడూరు పీడబ్ల్యుడీ నుంచి చౌడారం వరకు ముదున్నర కిలోమీటర్ల రోడ్డు మరమ్మత్తుకు రూ.1కోటి 58లక్షలు, నారాయణరావు పెట మండలంలోని కోదండరావు పల్లి గ్రామం నుంచి లక్ష్మి దేవి పల్లి ఎస్సి కాలనీ వరకు కిలోమీటరన్నర రోడ్డు మరమ్మత్తుకు రూ.66.30లక్షలు, నంగునూరు మండలం లోని అక్కెనపల్లి నుంచి కరీంనగర్ జిల్లా బర్డర్ వరకు కిలోమీటరన్నార రోడ్డు మరమత్తుకు రూ.59 లక్షలు, సిద్ధిపేట అర్బన్ మండలంలోని బూరుగుపల్లి వడ్డెర కాలనీ నుంచి ఎన్సాన్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తిప్పర వేణి కాలనీ వరకు కిలోమీటరన్నరకు రూ.66.74 లక్షలు, సిద్ధిపేటరూరల్ మండలం లోని రఘూవాపూర్ నుంచి హాసన్ మీరా పూర్ వరకు దాదాపు 4 కిలోమీటర్లు రూ.1 కోటి 63 లక్షలు మంజురు అయ్యాయని తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సౌకర్యాలు లేవు.. ఏర్పాట్లు బాగాలేవు

- జాతర ఏర్పాట్ల పట్ల అధికారులు, ప్రభుత్వం విఫలం
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-దుబ్బాక



సుమారు 5 లక్షల మంది వచ్చే కూడవెల్లి జాతరలో కనీస సౌకర్యాలు లేవు. సిబ్బంది తక్కువ ఉన్నారు. జాతర ఏర్పాట్లు బాగా లేవు. మహిళలకు స్నానపు గదులు తగినంతగా ఏర్పాటు చేయలేదు. సౌకర్యాలు చాలా దారుణంగా ఉన్నాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల్లో వచ్చే భక్తులకు అనుగుణంగా వసతులు ఏర్పాట్లు చేయడంలో అధికారులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అక్బర్ పేట భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని కూడవెల్లి రామలింగేశ్వ రాలయాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి బుధవారం సందర్శించారు. భక్తుల అసౌకర్యాలను తెలుసుకుంటూ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మీడియతో మాట్లాడారు. జాతరకు వచ్చి పోయే దారి ఒకటే కావడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని. ప్రత్యామ్నాయ దారిని ఏర్పాటు చేయకపోవడం అధికారుల వైఫల్యానికి నిదర్శనం అని విమర్శించారు. దొంగతనాలు, తప్పిపోవడాలు, జనాల రద్దీని నియంత్రించడానికి తగినంతగా ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది లేకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.100 మంది పోలీసు సిబ్బంది ఉండాల్సిన ఈ జాతరలో కేవలం 30 మంది సిబ్బంది లేరని. మరో మూడ్రోజులు జరిగే ఈ జాతరకు కిక్కిరిసపోయేంత జనం వస్తారని, తొక్కిసలాట జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాష్, బీఆర్ఎస్ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షులు గుండెల్లి ఎల్లారెడ్డి, అక్బర్ పేట భూంపల్లి మండలాధ్యక్షులు జీడిపల్లి రవి, బండి మురళి గౌడ్, పూజారి చంద్రం పలువురు ఉన్నారు.

రహదారి భద్రతపై ప్రతి ఒకరికి అవగాహన ఉండాలి





నవతెలంగాణ- దౌల్తాబాద్

రోడ్డు మీద ప్రయాణం చేసేటప్పుడు వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణ గురించి కృషి చేయాలని తెలిపారు. మోటార్ సైకిల్ నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనం నడిపేటప్పుడు తప్పకుండా సీటు బెల్టు ధరించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ఇన్సూరెన్స్, మోహనాల ఫిట్నెస్ కలిగి ఉండి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ములుగు: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రమైన ములుగు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా రాజీవ్ రహదారి దగ్గం ములుగు ఎస్ఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు రహదారి భద్రతపై ప్రతీఒక్కరు చైతన్యం కలిగి వాహనాలు నడపాలన్నారు.ప్రమాదాలను అరికట్టాలంటే హెల్మెట్ తప్పనిసరి అని, లైసెన్ తప్పకుండా ప్రతి వాహనదారునికి ఉండాలని, ఫోర్ వీలర్ నడిపే ప్రతి ఒక్కరు తప్పకుండా సీట్ బెల్టు ధరించాలని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, వాహనదారులు పాల్గొన్నారు.

వేతనాలు 1వ తేదీన ఇవ్వాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజులు



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గజ్వేల్ మండలం మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రతి నెల ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజులు అన్నారు. బుధవారం మండలం మోడల్ స్కూల్ పాఠశాలలో నూతనంగా జాయిన్ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వెల్ మండల శాఖ ఆధ్వర్యంలో, మోడల్ స్కూల్, గజ్వెల్, బూరుగుపల్లి, కొడకండ్ల, ప్రజ్ఞాపూర్, తిమ్మక్కపల్లి, కోదండరామ్ పల్లి, గుండనపల్లి, రిమ్మనగూడ, ధర్మారెడ్డి పల్లి, కోమటిబండ, దాచారం పాఠశాలలో సమస్యల సేకరణ చేయడం జరిగిందన్నారు. మోడల్ స్కూల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మొదటి తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు.సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలన్నారు. కేజీబీవీల సమస్యలు పరిష్కరించాలని, ఎస్ఎస్ ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శు లు తాళ్ల నాగరాజు, గోక విద్యాసాగర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాపగారి పాపిరెడ్డి, జోన్ కన్వీనర్ జల్లెల శ్రీనివాస్ యాదవ్, బాధ్యులు పంబాల ఎల్లయ్య, జిల్లా కౌన్సిలర్ దమ్మని మల్లయ్య, ఆకుల శ్రీనివాస్,నాయకులు, పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో పాఠశాలలను అభివృద్ధి చేయాలి

నవతెలంగాణ-కొండపాక



వినూత్న ఆలోచనలను అమలు చేస్తూ విద్యార్థులను అన్ని విషయాల్లో ప్రమాణాలు పెంచే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కుకునూరు పల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. మండలంలోని తిప్పారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్‌ను మంగళవారం, బుధవారం, కుకునూరు పల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు ఉపాధ్యాయులు తమ తమ ఆలోచనలను వినూత్నంగా అమలు చేస్తే విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుం దన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు వినూత్నంగా ఒక్కో విద్యార్థి ఫోటోతో పాటు పాఠశాలలో జరిగిన కార్యక్రమాల ఫోటోలను సమకూర్చి ప్రత్యేకంగా క్యాలెండర్ రూపొందిం చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు రాజ్ బహదూర్ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సత్య కృష్ణ, మండల అధ్యక్షుడు రామచంద్రం, జిల్లా కౌన్సిలర్ కొండి మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు మహాధర్నాను జయప్రదం చేయాలి

- జేఏసీ చైర్మెన్ వకుళా భరణం నర్సయ్య పంతులు
- సభా స్థలాన్ని పరిశీలించిన జేఏసీ, అఖిల పక్ష నాయకులు




నవతెలంగాణ-చేర్యాల

అన్ని అర్హతలు ఉన్న చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని జేఏసీ చైర్మెన్ వకుళా భరణం నర్సయ్య పంతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవిన్యూ డివిజన్ సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద నేడు జరిగే మహా ధర్నా స్థలాన్ని బుధవారం అఖిలపక్ష నాయకులతో కలిసి జేఏసీ చైర్మెన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల రెవిన్యూ డివిజన్ సాధించే వరకు అలుపెరుగని పోరాటాలు చేయాలని అందులో భాగంగానే నేడు జరిగే మహా ధర్నాకు ప్రతి గ్రామం నుండి ఇంటికొక్కరుగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా నేడు సుమారు 2000 మందితో మహా ధర్నాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర నాయకులు పొగాకు జయ రామచందర్ తోపాటు అన్ని పార్టీల నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సిద్ధిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్ గౌడ్, టీడీపీ పట్టణ అధ్యక్షులు మిట్టపల్లి నారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ పుర్మ వెంకట్ రెడ్డి, టీ ఎంఆర్ పీఎస్ జిల్లా నాయకులు భూమిగారి రాజేందర్,సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్ కుమార్, పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ఎగిరిన ఎమ్మార్పీఎస్ జెండాలు

- వర్గీకరణ అమలు చేయాలని ప్రత్యేజ పూజలు



నవతెలంగాణ-జగదేవపూర్

మండలం పరిధిలోని చాట్లపల్లి, తిగుల్ నర్సాపూర్, జంగారెడ్డి పల్లి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు, ర్యాలీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం బేషరతుగా ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 7 హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు..వేల గొంతుల కార్యక్రమానికి మాదిగ, ఉప కులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ నాయకులు పిలుపు నిచ్చారు. కొండపోచమ్మ ఆలయంలో ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యేలా చూడు తల్లి అంటూ అమవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరురా డప్పుల చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాల ప్రజా ప్రయోజనాల కోసం పోరాటం చేసి ఎన్నో విజయాలు సాధించిన సంఘము అని గుర్తు చేశారు. భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం వర్గీకరణ అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ నాయకులు తొపెట్ల కరుణాకర్, మల్లేశం, అభి నర్సింలు గడ్డం సురేందర్ , చాట్లపల్లి గ్రామ అధ్యక్షులు కిరణ్ కుమార్, తీగుల్ నర్సాపూర్ గ్రామ అధ్యక్షులు మాసపాక నర్సంలు, తదితరులు పాల్గొన్నారు.

గద్దరన్నపై బండి సంజయ్ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

- ప్రజా సంఘాల డిమాండ్

నవతెలంగాణ-సిద్ధిపేట



ప్రజా యుద్ధనౌక గద్దరన్నపై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అసంబద్ధమైన వాఖ్యాలను ఉపసంహరించుకోవాలని వివిధ ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ప్రజా సంఘాల నాయకులు శ్రీహరి యాదవ్, ఆస లక్ష్మణ్, ఎస్వి శ్రీకాంత్, మెట్ల శంకర్, పి శంకర్, భీమ్ శేఖర్, తుక్కొజిగూడ సతీష్ లు విలేకరులతో మాట్లాడుతూ జీవితాంతం ప్రజల విముక్తి కోసం, నవ సమాజ నిర్మాణం కోసం గద్దరన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి హెూదాలో రాజ్యాంగ బద్ధ పదవిలో ఉండి రాజ్యాంగానికి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా గద్దరన్న పై అనుచిత వ్యాఖ్యలు చెయ్యడం తగదన్నారు. బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని హెచ్చరించారు.

31న హైదరాబాద్‌లో గద్దరన్న జయంత్యోత్సవం..

ఈనెల31న రవీంద్ర భారతిలో జరిగే గద్దరన్న 77 వ జయంత్యోత్సవాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, గద్దర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే జయంతోత్సవానికి తరలి రావాలని కోరారు. గద్దరన్న జయంతిని అధికారికంగా జరపాలని ప్రభుత్వం జీఓ జారి చేసినందున అధికారికంగా జరపాలని కోరారు.

అజాటో బ్యాక్టర్‌తో యూరియా వినియోగం తగ్గించవచ్చు

నవతెలంగాణ-తొగుట



అధిక మొత్తంలో రసాయనక ఎరువులు వినియోగించడం వలన నేల సారం క్షీణిస్తుందని వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున రైతులకు సూచించారు. బుధవారం పెద్ద మాసాన్ పల్లి గ్రామ రైతు అనిల్ వ్యవసాయ క్షేత్రంలో జీవన ఎరువు అజాటో బ్యాక్టర్ పై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక మొత్తంలో రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలని తెలిపారు. సేంద్రియ ఎరువుల్లో జీవన ఎరువుల కూడా ఒకటి, జీవన ఎరువులను పంట లకు అందించేటప్పుడు నేలలో జీవరాశి పెంపొం దించడంతో పాటు భూమికి సారం పెరిగి అధిక దిగుబడులను పొందవచ్చని అన్నారు. జీవన ఎరువులో నత్రజనిని స్థిరీకరించే బ్యాక్టీరియా అజాటో బ్యాక్టర్, నేల సారవంతం చేయడానికి, మొక్క ఎదుగుదలకు దోహదపడుతుందని సూచించారు. అజాటోబ్యాక్టర్ గాలిలో ఉన్న నత్రజని స్థిరీకరించి మొక్క తీసుకునే అమోనియా రూపంలోకి మారుస్తుందని చెప్పారు. అజటో బ్యాక్టర్ సుమారుగా 16 కేజీల నత్రజనిని సుమారు 40 కిలోల యూరియా ఒక ఎకరానికి కి ఒక సంవత్సరంలో స్థిరీకరిస్తుందని వివరించారు. అజ టోబ్యాక్టర్ సుమారుగా 30 శాతం రసాయన ఎరువుల వాడకం తగ్గిస్తుందని, పప్పు పంటలు మినహా అన్ని పంటలకు వినియోగించావచ్చని అన్నారు. విత్తుకునేటప్పుడు, నాటు వేసేటప్పుడు విత్తన శుద్ధి, వేరు శుద్ధి చేసుకోవాలని, భూ శుద్ధి కోసం 100 కిలోల మాగిన పశువుల పేడలో 500 మిల్లీ లీటర్ కలిపి మొక్కలు నాటే సమయంలో పొలం లో చల్లుకోవాలని తెలిపారు

దండోరా దళపతి చిత్రపటానికి పాలాభిషేకం

- ఎం.ఈ.ఎఫ్ గజ్వేల్ మండల అధ్యక్షులు సల్ల శ్రీనివాస్

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

దండోరా దళపతి మందకృష్ణ మాదిగను పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడం చాలా అభినందనీయమని ప్రజ్ఞాపూర్ అంబేద్కర్ సంఘం నాయకులు, జై భీమ్ యూత్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ప్రజ్ఞాపూర్ లోని ఏసీపీ కార్యాలయం ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం టపాకాయలు కాల్చి, సీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ పురస్కారాలలో అణగారిన వర్గాల పక్షాన వారి హక్కుల కోసం పోరాడిన నాయకుడు మందకృష్ణ మాదిగ ఉండడం సంతోషకరంగా ఉందని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసనమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాపూర్ అంబేద్కర్ సంఘం నాయకులు గుంద్ర నర్సయ్య, దాకని బిక్షపతి, ఈది దుర్గయ్య,నర్సి చంద్రయ్య, ఈదుగాని శివులు, శివ్వని ఎల్లం , భూమని మల్లేశం, గుంద్ర రామచంద్రం, పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకున్న భక్తులు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో కొలువైన దత్తాత్రేయుని మాఘ అమావాస్య పురస్కరించుకొని బుధవారం ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఉదయం ఆలయ నిర్మాణ కర్తలు చీకోటి వంశస్తులు స్వామివారికి అర్చనా, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని నివేదించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. పాలమాకుల, రాజగోపాల్ పేట, వెంకటాపూర్, ముంద్రాయి నాలుగు గ్రామాల సరిహద్దులో జరిగిన జాతరకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గుండంలో పుణ్య స్నానాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

మున్సిపల్ మాజీ చైర్మెన్‌కి ఘన సన్మానం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మున్సిపల్ తాజా మాజీ చైర్మెన్ ఎస్‌సీ రాజమౌళిని బుధవారం విశ్వకర్మ సంగం అధ్యక్షులు గడియారం వెంకటాచారి ఆధ్వర్యంలో విశ్వకర్మ సంఘం కమ్యూనిటీ హాల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు ఏండ్లు నుంచి గజ్వేల్, ప్రజ్ఞాపూర్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. వారి సారథ్యంలోనే విశ్వకర్మమైన సంఘం కమిటీ హాలు నిర్మాణం జరిగిందని. వారి సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, వారికి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్యను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి గడియారం వితలాచారి, కోశాధికారి అరుణోజి లక్ష్మీనరసింహ చారి, గడియారం నాగరాజు చారి, పల్లెపాడు మాజీ సర్పంచ్ కొక్కొండ శ్రీనివాస్ చారి, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఓదార్చిన రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణానికి చెందిన విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు షేక్ హుస్సేన్ కుమారుడు మోసిన్ (29) కొడుకు బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకుని బుధవారం ఆ కుటుంబాన్ని మున్సిపల్ మాజీ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి, కబడ్డీ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నేతి చిన్న సంతోష్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చి చెప్పారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు రమణారెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అన్ని గ్రామాలకు వర్తింపచేయాలి

నవతెలంగాణ-గజ్వేల్



సంక్షేమ పథకాలు అన్ని గ్రామాలకు వర్తించాలి అని కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ నిమ్మరమేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడ ుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గజ్వేల్ మండలంలో ఒకే గ్రామానికి పరిమితం చేశారని మిగతా గ్రామాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గజ్వేల్ మండలంలో 25 గ్రామపంచాయతీ ఉన్నాయని వాటి పరిస్థితి ఏమిటో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు.

కులదురహంకార హత్యలు తెలంగాణ సమాజానికి సవాళ్లు..

- సిద్దిపేట, సూర్యపేట జిల్లాలో కూడా నెలకొన్న కులదురహంకారం

నవతెలంగాణ-మిరుదొడ్డి



దేశమంతా జనవరి 26 ఆదివారం 76వ గణతంత్ర వేడుకలలో మునిగిపోగా పోరాటాల కేంద్రమైన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన కుల దురంహర పరువు హత్యతో దళితుడి రక్తంతో తడిసి ముద్దయినది. ఇబ్రహీంపట్నం, రాయపోల్ నాగమణి రక్తం తడి అరక ముందే ప్రణయ్‌ని హత్య చేసిన పోరాటాల ఖిల్లాలోనే. సమసమాజ నిర్మాణానికి త్యాగాలు చేసిన నల్గొండ గడ్డ మీదనే మళ్ళీ మరో పరువు హత్య జరిగినది. దోపిడి పిడన అసమానతలు అన్యాయలకు వ్యతిరేకంగా బరిగీసి నిలబడ్డ తెలంగాణలో కుల దురహంకార హత్యల పరంపర కొనసాగుతున్నాయి. పరువు పేరుతో జరుగుతున్న కులదురహంకార హత్యలను పరిశీలిస్తే తెలంగాణ సమాజం చైతన్య వంతమైన సమాజం కాదాని అనుమానం రాక తప్పదు. సమానత్వ పోరాట స్ఫూర్తి ఎటు పోయినట్లు అనే ప్రశ్నలు తలెత్తుత్తున్నాయి. చైతన్య వంతమైన, ప్రగతిశీల బావాజాలం కలిగిన తెలంగాణలో ఉత్తరాది రాష్టాలాగా కులం పంజా విసురుతుంది. నిండనై జీవితాలను గడపక ముందె నవయవ్వన యువకులకు తమ కులం కొరలతో నూరెళ్ళు నింపుతున్నారు. ప్రణయ్,మంధని మధుకర్, భువనగిరి నరష్, ఇబ్రహీంపట్నం మహిళా కానిస్టేబుల్ నాగమణి రక్తం తడి అరక ముందే సమాత్వానికి ప్రతికగా జరుపుకొనే గణతంత్ర వేడుకల రోజే సూర్యాపేట కృష్ణ కుల దురంహాకార హత్యకు గురయ్యాడు.రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో దళిత యువకుడు శ్రీకాంత్‌ను కులాంతర వివాహం చేసుకున్న మహిళ కానిస్టేబుల్ నే తన తమ్ముడు అత్యంత దారుణంగా హత్య చేశాడని గుర్తు చేశారు. వరుసగా జరుగుతున్న కులదురహంకార హత్యలను అరికటాలని,కులాంతర వివాహం చేసుకున్న జంటలకు రక్షణ కల్పించాలని, రాష్ట్రంలో కుల వివక్షతను నిర్మూలించెందకు ప్రణాళికబద్ధంగా ప్రతినెల చివరన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగహన కల్పించాలి. కులవివక్షను ప్రతిఘటించేందుకు బుద్ధి జివులు సిద్ధం కావాలి.

-పి.శంకర్, జాతీయ కార్యదర్శి దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్), 9441131181

జనసంద్రమైన సింగరాయ జాతం

- ఒక్కరోజు జాతరకు వేలాదిగా తరలిన భక్తులు
- ప్రకృతి అందాలను అస్వాదించిన భక్తజనం





నవతెలంగాణ-కోహెడ

మండలంలోని కూరెళ్ళ, తంగళ్ళపల్లి, బస్వాపూర్, గుండారెడ్డిపల్లి గ్రామాల సరిహదులలోని సింగరాయ జాతరకు ప్రతియేడు మాఘశుద్ధ పుష్య బహుళ అమావాస్య రోజున జరిగే సింగరాయ జాతర బుధవారం జనసంద్రంగా మారింది. జిల్లా నుండే కాక వివిధ జిల్లాల, రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. లక్షలాదిగా భక్తులు తరలివచ్చి శ్రీ ప్రతాప రుద్ర లక్ష్మినరసింహు డిని దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. భక్తులు సూర్యోదయానికి ముందే సింగరాయ కొండకు చేరుకొని అక్కడ తూర్పు నుండి పడమరకు పారే మోయతు మ్మెదవాగులో స్నానమా చరించి అనంతరం కొండపై ఉన్న స్వామివారిని దర్శించు న్నారు. చెలిమే నీటిని సేకరించి వంటలను వండుకొని స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అలాగే జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కర్ణకంటి మంజూలరెడ్డి జాతరకు హాజరై స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకు న్నారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. హుస్నాబాద్ సీఐ కె.శ్రీను, కోహెడ ఎస్సై పుల్ల అభిలాష్, హుస్నాబాద్ ఎస్సై తోట మహేష్, కానిస్టేబుల్‌లు బందోబస్తులో పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

-ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండపాక మండలం గిరాయిపల్లి గ్రామానికి చెందిన మైలారం సంతోష్ కుమార్ ప్రమాదవస్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందారు. ఆ కుటుంబానికి పార్టీ భీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలను కంటి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. కార్యకర్తలకు ప్రమాద బీమా నుండి ఆదుకుంటున్నమన్నారు. మాజీ జెడ్పీటీసీ ప్రశాంత్, మండల అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్, గిరాయిపల్లి మాజీ సర్పంచి సంజీవరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన మెనూను అమలు చేయాలి

-యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రవి, తిరుపతి డిమాండ్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో ఉన్న బాయ్స్ ఎడ్యుకేషన్ హబ్, హాస్టల్స్ సందర్శించిన యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన మెనూ మొదలైన కూడా అమలుకు నోచుకోలేని పరిస్థితి గజ్వేల్ హబ్ హాస్టల్లో ఉందన్నారు. స్కూల్ హాస్టల్స్ వార్డెన్లు సమయానికి రావట్లేదని అన్నారు. విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతున్నారు. నూతన మెను అమలు చేయమంటే డబ్బులు ఎక్కువగా అవుతున్నాయని పాత మెను పెడుతున్నారు. వందల మంది ఉన్న విద్యార్థులకు న్యాయం చేయలేని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. లేనియెడల విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు నాచారం శేఖర్, డివిజన్ నాయకులు తిమ్మాపురం యాదగిరి, సందీప్, నిఖిల్ , దినేష్ తదితరులు ఉన్నారు.

బాబు దత్తత గ్రామానికి శిష్యుని పథకాలు

నవతెలంగాణ-గజ్వేల్



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఆ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఆ గ్రామాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ప్రతి పథకం అదే గ్రామం నుంచి ప్రారంభించారు. ఆ గ్రామాన్ని అప్పట్లో బాబు దత్తత తీసుకున్నారు. అదే గ్రామానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలు నాలుగింటిని సైతం అదే గ్రామం నుండి అమలు చేయాలని ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రామంలో చర్చ జరుగుతుంది. బాబు గారి దత్త గ్రామంలో శిష్యుడు ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అమలవుతున్నాయని చర్చించుకోవడం కనిపించింది. మంగళవారం ఆ గ్రామాన్ని నవతెలంగాణ విలేకరి సందర్శించారు.

వివరాల్లోకి వెళితే..

గజ్వేల్ మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల గిరిపల్లి గ్రామంలో 26న ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 పథకాలను అదే గ్రామం నుంచి అమలుపరచాలని ప్రభు త్వం భావించింది. మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా గిరిపల్లి గ్రామానికి మళ్లీ ప్రభుత్వం గిరి గీసినట్టు అదే గ్రామాన్ని ఎంపిక చేసింది. గ్రామంలో మొత్తం 2500 జనాభా ఉండగా 950 పైగా ఓట్లు ఉన్నాయి. ప్రస్తుతం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు నాలుగు పథకాలను ఇక్కడ అమలు కోసం కొందరిని గుర్తించి పథకాలు అందించారు. రేషన్ కార్డులు గ్రామంలో 170 మంది దరఖాస్తు చేసుకోగా 140 మందికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 456 మందిలో 207 మందికి, రైతు భరోసాను 556 మందికి, ఆత్మ భరోసాను 34 మందికి అందించారు.

ఉమ్మడి రాష్ట్రంలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ టీడీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ప్రజల వద్దకు పాలన, జన్మభూమి, పనికాహార పథకం తదితర పథకాలను గిరిపల్లి గ్రామం నుంచి ప్రారంభించే వారు. గజ్వేల్ మండలంలో మోడల్ గ్రామపంచాయతీగా గిరిపల్లి గ్రామానికి పేరు ఉందని చెప్పాలి.

